
దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ


| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 318 | ది. 3-3-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 318 | Date : 3-3-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## ప్రయాణికులకు అలర్ట్.. ఎయిర్ ఇండియా కీలక ప్రకటన

**న్యూ ఢిల్లీ,మార్చి 2 (వార్తాప్రభ) :** ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్న వేళ పశ్చిమాసియాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా పలు దేశాలకు విమాన సర్వీసులను నిలిపివేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఖతార్‌లకు వెళ్లే అన్ని విమానాల సస్పెన్షన్‌ను ఎయిర్ ఇండియా సోమవారం(మార్చి 2) రాత్రి 11.59 గంటల వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రయాణీకులకు సూచనలు చేసింది.

# సమర్ధ పాలనకు అన్ని శాఖల్లోనూ ఏఐ వినియోగం

● డ్రోన్, సీసీ టీవీ, శాటిలైట్ డేటా సమీకృతం చేసే మెకానిజం ● వేసవి దృష్ట్యా ఆర్టీసీ బస్టేషన్లలో తాగునీటిపై శ్రద్ధ పెట్టండి ● ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్సన్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి, మార్చి 2 (వార్తాప్రభ) :** అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్ధత మరింత పెంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్సన్‌పై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... వివిధ అంశాలపై చర్చించారు. డ్రోన్, సీసీ టీవీ కెమేరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి... వినియోగించుకునేలా ఒక మెకానిజం తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్ స్టేషన్లలో తాగునీటికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా జరిగేలా పరిస్థితులు ఉండాలన్నారు. అటు పెన్షన్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా, అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి తప్ప, పదేపదే ఒకేరకమైన సమాచారం కోసం ప్రజలను, ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మరోవైపు రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కి పెంచినట్టు తెలిపారు. అయితే వీటన్నింటినీ సులభంగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం చెప్పారు.

# 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యా: రేవంత్ రెడ్డి

● రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే గళమెత్తానన్న ముఖ్యమంత్రి ● తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి ● రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య



**వికారాబాద్,మార్చి 2 (వార్తాప్రభ) :** తాను 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తాను రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపై గళమెత్తానని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ పైరవీలు చేయలేదని తెలిపారు. తన మీద అనేక కేసులు పెట్టారని, కోర్టుకు కూడా వెళ్లానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యం కూడా అదేనని అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, రాహుల్ గాంధీ అనేక సమస్యలపై పోరాటం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం కారణంగా వివిధ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వ సహాయం

● ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్‌కు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
● కేంద్రంతో సమన్వయం చేసుకుని, పౌరులు సురక్షితంగా తిరిగి వచ్చేలా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం



**అమరావతి,మార్చి 2 (వార్తాప్రభ) :** పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను సురక్షితంగా తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. సహాయక చర్యల విషయంలో ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్ కలిసి పనిచేయాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సీఎం చెప్పారు. కేంద్రం ద్వారా ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

**హెల్ప్ లైన్ నెంబర్ 0863-2340678..**

గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీతో కలిసి చర్యలు చేపట్టింది. వారికి సహాయం కోసం 0863-2340678 హెల్ప్ లైన్ నెంబర్, 85000 27678 వాట్సప్ నెంబర్‌ను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏపీ ఎన్ఆర్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. ప్రవాసాంధ్రులు సంప్రదించిన వెంటనే ఏపీ ఎన్నార్టీ వారికి తక్షణం సహాయ, సహకారాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటు helpline@apnrts.com, support@apnrts.com, info@apnrts.com ఈ మెయిళ్లు, https://apnrts.ap.gov.in వెబ్సైట్‌ను కూడా సంప్రదించవచ్చు

# సాగునీటి భద్రతకు భరోసా

● వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుతో రైతులకు భారీ ఊరట
● సీఎం చంద్రబాబు, మంత్రి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,మార్చి 2 (వార్తాప్రభ) :** ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు గొప్ప ఊరట కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మొత్తం 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 6,593, ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,926, ఈపిడీసీఎల్ పరిధిలో 27,594 కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్షన్ల మంజూరుతో రైతులకు సాగునీటి భద్రత లభించి, పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అనేక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఇప్పుడు ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చి పరిష్కరించడం రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, సాగునీటి వనరులను మెరుగుపరచడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తుకు భరోసా కలిగించే విధంగా ఉంటుందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.

# మహిళ భద్రత... సమాజ భద్రతకు మూల స్తంభం

● విజయవాడలో మహిళా భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహణ ● సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ ●ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది ● ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలి ● మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబుదే... హోం మంత్రి అనిత




**విజయవాడ,మార్చి 2 (వార్తాప్రభ) :** మహిళా భద్రత వారోత్సవాల సందర్భంగా విజయవాడ సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఐజి రాజకుమారి, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎస్పీ సరిత, ఈగల్ ఎస్పీ నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో మహిళా భద్రతపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత 'శక్తి టీమ్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గినట్లు వెల్లడించారు. ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, మహిళ సాధికారత సాధిస్తే కుటుంబం మొత్తం సాధికారత సాధించినట్లేనని చెప్పారు. మహిళ భద్రత సమాజ భద్రతకు మూలస్తంభమని, మహిళా అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానమని పేర్కొన్నారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని, ఆడపిల్లలతో పాటు మగపిల్లలను కూడా బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి ఆడపిల్లను తల్లి, సోదరి భావనతో గౌరవించాలని, మహిళల పట్ల గౌరవం ఇంటి నుంచే ప్రారంభ మవ్వాలని అన్నారు. పిల్లలకు కోట్ల ఆస్తి కంటే సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, పరిష్కార శక్తి ఇవ్వడం ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఒక తల్లి ప్రసవ వేదనను మాటల్లో చెప్పలేమని, మహిళల శక్తి అపారమని అన్నారు.

# సియం ఎక్స్అఫిషియో స్పెషల్ సిఎస్ గా బాధ్యతలు స్వీకరించిన విజయానంద్





**అమరావతి,మార్చి 2 (వార్తాప్రభ) :** సియం ఎక్స్అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కావేటి.విజయానంద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 28న సిఎస్ గా ఆయన పదవీ విరమణ చేయగా ప్రభుత్వం విజయానంద్ ను ముఖ్యమంత్రివర్యుల ఎక్స్అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో సోమవారం రాష్ట్ర సచివాలయం మొదటి భవనంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం మరియు టిటిడి వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, సచివాలయ వివిధ విభాగాల అధికారులు,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు విజయానంద్ కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.


## దస్తావేజు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్, జక్కంపూడి, డోరు నెం.2-45 కాపురస్తుడు చనుమోలు వెంకటేశ్వరరావు గారి కుమారుడు చనుమోలు సత్యనారాయణ అను నా పేరిట ది.03-08-2011వ తేదీన నున్న సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో 1వ పుస్తకం, నెం.2429/2011రుగా గల ఒరిజినల్ దఖలు దస్తావేజు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను బండికి తగించుకొని, కేదారేశ్వరపేట ప్రభాస్ కాలేజి వద్ద నుండి మా ఇంటికి వెళ్లు సందర్భంలో కొత్తపేట పరిసర ప్రాంతంలో ది.28-02-2026వ తేదీన జారిపడిపోయినది. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ ఇంటి కాగితములు వెతకగా ఎక్కడా కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజులను ఎవరికినీ తాకట్టు పెట్టుట గానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.9440447419


# కష్టకాలంలో కరుణామృతం

● 34 మందికి రూ.30.86 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ● అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం,మార్చి 2 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.30.86 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో సీఎం సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి

● గడువులోపు సమస్యకు పరిష్కారం చూపాలి
● ఎన్‌టీఆర్ జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 174 అర్జీలు
● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,మార్చి 2 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు పరిష్కారం

- 8లో

# నివాళులర్పించిన వైసిపి నాయకులు



**విస్సన్నపేట,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వైసీపీ కార్యకర్త కారుమంచి దాస్ మరణించడంతో వైసీపీ నాయకులు ఆయన పార్తివదేహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, ఎంపీపీ గద్దల మల్లయ్య, గొర్రె లాజర్,సిరసాని ప్రకాష్, పి లక్ష్మయ్య,పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి కుటుంబరావు,పిల్లి రాజేష్, సాదుపాటీ కోటేశ్వరరావు,మేకల రవి, దస్తగిరి, కోట కిట్టు, కాంతయ్య, రామచంద్ర రెడ్డి తదితర వైసిపి నాయకులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# నివాళి అర్పించిన జనసేన నాయకులు నంబూరి అక్కల



**తిరువూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణ ప్రముఖులు జనసేన నాయకుడు ఉయ్యూరి జయప్రకాష్ తండ్రి శంకర్రావు దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన జనసేన నాయకుడు అకాల గాంధీ నంబూరు శ్రీనివాసరావు పసుపులేటి పండు నామ నాగరాజు పసుపులేటి రవీంద్ర లింగనేని సుధాకర్ రామిశెట్టి జగన్ రవి చెలికాని నగేష్ ఘన నివాళులర్పించారు

# ఆహ్వాన పత్రం అందజేత



**తిరువూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం అక్కపాలెం గ్రామంలో ఈ నెల 8వ తారీకు శ్రీశ్రీశ్రీ నబిలాంబ బొడ్రాయి మరియు ముత్యాలమ్మ తల్లి మహాలక్ష్మమ్మ తల్లి పోతురాజు స్వామి విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమానికి హాజరవ్వాలని జయకృష్ణ హాస్పటల్ డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారిని కలిసి ఆహ్వాన పత్రం అందించిన దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పర్వతనేని జగన్

# పెనుగుదురులో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**కాకినాడ రూరల్/కరప,మార్చి 2 (వార్తాప్రభ) :** కరప మండలం పెనుగుదురు గ్రామం జగనన్న కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ జరిగింది. జెడ్.భావరం సరిహద్దులో కరప మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి 12.50లక్షల వ్యయంతో సిసి రోడ్ శంకుస్థాపన చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు, కరప మండలంలో అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రైన్లు,వేయడం జరుగుతుందని ఇందుకు 94పనులకు 11కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.తెలిపారు. పెనుగుదురు మాజీ ఎంపిటిసి తుమ్మలపల్లి మాచర రావు, పెనుగుదురు జనసేన పార్టీ అధ్యక్షులు గంటా నాని బాబు, జెడ్. భావారం జనసేన పార్టీ అధ్యక్షులు గుణ్ణం ఉదయ శంకర్,టిడిపి అధ్యక్షులు పాలిక సూరిబాబు, పెనుగుదురు జనసేన వీర మహిళ గుబ్బల భవాని సత్తిబాబు, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





విజయవాడ వన్ టౌన్ యాదవ కల్యాణ మండపంలో యాదవ పెద్దల సమక్షంలో మార్చి 15, అదివారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళా క్షేత్రంలో జరగనున్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ కుమార యాదవ్ సన్మాన సభకు సంబందించిన కరపత్రం మరియు గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమ చిత్రం

**–విజయవాడ పశ్చిమ,మార్చి 2 (వార్తాప్రభ) :**

# పార్టీ కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ధీశాలి నేత బచ్చుల అర్జునుడు


**● బచ్చుల అర్జునుడు 3వ వర్ధంతి సందర్భంగా గన్నవరం టిడిపి కార్యాలయంలో ఘన నివాళులు**



**గన్నవరం,మార్చి 2 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు గారి 3వ వర్ధంతి సందర్భంగా గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గారి ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు ఉదయం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన స్మారక సభలో రాష్ట్ర టిడీపి కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడుతూ ఆయన రాజకీయ ప్రస్థానాన్ని స్మరించారు. 2014లో కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షుడిగా, 2017లో ఎమ్మెల్సీగా, 2020లో పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత పార్టీకి ఆదర్శమని తెలిపారు. ప్రతిపక్షంలో పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో గన్నవరం నియోజకవర్గంలో పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తలకు ధైర్యం నూరిపోసిన నాయకుడు బచ్చుల అర్జునుడు గారేనని పేర్కొన్నారు. 2020 నుండి 2023 వరకు నియోజకవర్గ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేశారని కొనియాడారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో, వారికి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలను నెరవేర్చడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, గన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, టిడిపి జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ సుధాకర్, గన్నవరం మండల బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర టిఎన్ టియుసి కార్యదర్శి బుస్సే నాగప్రసాద్, నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చల్లగుళ్ళ సందీప్, గన్నవరం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బుస్సే సరిత, గన్నవరం మండల తెలుగుయువత అధ్యక్షులు నందిపాముల పృథ్వీ, జిల్లా విజిలెన్స్ బోర్డు డైరెక్టర్ తిరువీధి నరేష్, టిడిపి నాయకులు సొంగా సంతోష్, కంచర్ల సూర్యప్రకాష్, కొండేటి నాగరాజు, నిమ్మకూరి మధు, ఆరిఫ్ పఠాన్, యెల్లా రఘు, చల్లగుళ్ళ సుమంత్, గుత్తా జయేంద్ర, రాహుల్, జయంత్, జయరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లాకు కాటమరాజు పేరు పెట్టండి..

**● స్పందన లో జిల్లా జాయింట్ కలెక్టర్ కు బీసీ సంఘం అధ్యక్షులు అబ్రహం రాజ్ కుమార్ విజ్ఞప్తి**



**మార్కాపురం,మార్చి 2 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లాకు కాటమరాజు పేరు పెట్టాలని మార్కాపురం జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు కలవకూరి అబ్రహం రాజ్ కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. మార్కాపురం ఎర్రగొండపాలెం గిద్దలూరు కనిగిరి ప్రాంతాల్లో కాటమరాజు చరిత్ర ఆనవాళ్లు ఉన్నాయని అత్యంత పేరు ఎన్నిక కలిగిన దైవ స్వరూపంగా విరాజిల్లుతున్నటువంటి ,ఈ నాలుగు నియోజకవర్గాల్లో అధిక సంఖ్యకులు పూజిస్తున్నటువంటి కాటమరాజు పేరును నూతన మార్కాపురం జిల్లాకు పెట్టడం సమంజసంగా ఉంటుందని వారు వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. వివిధ జిల్లాలకు అనేకమంది పేరెన్నిక కలిగినటువంటి ప్రముఖుల పేర్లను పెట్టడాన్ని ఈ సందర్భంగా స్వాగతిస్తూ ,బీసీ సామాజిక వర్గానికి చెంది రెండు తెలుగు రాష్ట్రాల్లోని యాదవులకు బీసీలకు ఇతర వర్గాల వారికి ముఖ్యులుగా పూజలందుకుంటున్నటువంటి కాటమరాజు పేరు ఈ జిల్లాకు పెట్టడం తప్పనిసరని తాము భావిస్తున్నామని రాజకుమార్ తెలియజేశారు. నేటి మార్కాపురం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వారి కార్యాలయంలో జరిగినటువంటి స్పందన కార్యక్రమంలో ఈ వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు కి అందజేయడం జరిగింది. వినతి పత్రాన్ని అందించిన వారిలో బత్తుల పెద్ద అల్లూరయ్య యాదవ్ ,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్, బాల గోవిందు యాదవ్ , బొరిగొర్ల గాలయ్య యాదవ్, గుర్రం శ్రీనివాస్ యాదవ్, శ్రీరాంపురం పిన్నిక శీను యాదవ్ ,రామాంజి యాదవ్ తదితరులు ఉన్నారు.

# రైతు బజారు మంజూరుకు అడ్డుపడుతున్న హస్తం ఎవరిది?



**విస్సన్నపేట,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో రైతు బజార్ ఏర్పాటుకు నాటి వైసీపీ ప్రభుత్వంలో బీజం పడిన అది ఫెయిల్యూర్ కావడం జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో రైతు బజార్ ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో కథనాలు వచ్చిన కార్యరూపం దాల్చకపోవడం పట్ల నిరోధించే హస్తం ఎవరిదన్న అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రైతు బజార్ కన్నా బయట మార్కెట్లో కూరగాయల ధరల రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్న రైతు బజార్ ఏర్పాటు చేస్తారన్న కలలు సామాన్యుడికి సహకారం అయ్యే పరిస్థితి కనబడటం లేదని పలువురు అనుకుంటున్నారు. ఇటీవల తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కెవి నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో విస్సన్నపేట బస్టాండ్ దగ్గర స్థలాన్ని పరిశీలించినట్లు విశ్వసినీ వర్గాల సమాచారం అందుతుంది. కానీ భూమి రిజిస్ట్రేషన్ చేయాలని అడిగినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎన్నో బస్టాండ్లు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అత్యధికంగా వ్యవసాయానికి పనికిరాని చెరువులు పూడ్చి భవనాలు నిర్మించినట్లుగా చరిత్ర ఉన్న రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని విస్సన్నపేట బస్ స్టాండ్ చెరువుకు సంబంధించిన భూమి నందు రైతు బజార్ ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ అనే అంశం ప్రతిబంధకంగా మారే పరిస్థితి ఉంటుందని పలువురు అనుకుంటున్నారు. ఏది ఏమైనా తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని ), మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు,స్థానిక రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల స్థాయి నాయకులు ఏకాభిప్రాయ సాధన తో రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేయాలని గ్రామపంచాయతీ మండల ప్రజా పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికల నాటికి రైతు బజార్ ఫలాలు అందించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇరాన్‌పై దాడులు సరికాదు - సీపీఎం నేత ఆంజనేయులు



**గన్నవరం,మార్చి 2 (వార్తాప్రభ) :** ప్రస్తుతం ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడులను సిపిఎం తీవ్రంగా ఖండించింది అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి చర్చలు జరుగుతున్న సమయంలో సైనిక చర్య తీసుకోవడం సరైనది కాదని, సంఘర్షణను తక్షణమే నిలిపివేసి, సంప్రదింపుల ద్వారా సమస్య పరిష్కరించాలని సీపీఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని ఆదివారం సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడు తూ "ఏ దేశంలోనైనా పాలనా విధానాన్ని బలవంతంగా మార్చాలని చూడటం, లేదా ఆ దేశ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా జోక్యం చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉన్నప్పుడు దాడులు చేయడం దుర్మార్గపు చర్య అని ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ వ్యవహారాల్లో జోక్యాన్ని, అక్కడ పాలన మార్పిడికి ప్రయత్నించడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారా మాత్రమే ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పబడుతుందని, యుద్ధం వలన సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోతారని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని, దాడులను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల నాయకులు బెజవాడ తాతబ్బాయి, సూరగాని సాంబశివరావు, మాదిరెడ్డి చిన్న, మిరప నాగేశ్వరావు, పఠాన్ సర్దార్, సిపిఐ నాయకులు చాగంటపాటి వెంకటేశ్వరరావు, విజయారావు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కృషితో తారు రోడ్డుకు 1.39 కోట్ల నిధులు - పనులు ప్రారంభం

**● పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య.....**



**పెనుగంచిప్రోలు, మార్చి 2 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని ఎన్‌హెచ్--65 నుండి ముళ్లపాడు గ్రామం వరకు గతుకులతో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కృషితో మొత్తం 1 -39 కోట్ల నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్--65 నుండి ముళ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఒక లేయర్ తారు రోడ్డు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా ముళ్లపాడు నుండి మక్కపేట వరకు 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు ప్యాచ్‌వర్క్ పనుల కోసం నిధులు మంజూరు చేయబడగా, ఆ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమయ్యే పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే తాతయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాలకు ఊతమిచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే గారు చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, టిడిపి నాయకులు వెల్ది అప్పారావు, ఐలపోగు వెంకటేశ్వర్లు, రోడ్డు సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన నాంచారమ్మ



**కోడూరు, మార్చి 2 (వార్తాప్రభ) :** విశ్వనాధపల్లి కృష్ణా నది తీరాన కొలువైయున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో సోమ వారం అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

# రేపు చంద్రగ్రహణం సందర్భంగా చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ముసివేత..

**అవనిగడ్డ,మార్చి 2 (వార్తాప్రభ) :** చంద్రగ్రహణం నేపథ్యంలో మంగళవారం చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల్లో ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం ఆలయాల ద్వారాలు తాత్కాలికంగా ముసివేయబడునని దేవాలయాల సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. గ్రహణ కాలములో ఎలాంటి దర్శనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడవన్నారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి భక్తులకు దర్శనము కల్పించబడును. భక్తులు సహకరించి దేవస్థాన నియమాలను పాటించాలని ఆయన సూచించారు

# గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ సేవలు అభినందనీయం..

–రీజనల్ చైర్మన్ నాగభూషణం



**హనుమాన్ జంక్షన్,మార్చి 2 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం లాంటి అత్యవసర సేవలతో పాటు విద్యాభివృద్ధికి హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు నిరూపమానమని రీజనల్ చైర్మన్ తిక్కిశెట్టి నాగభూషణం అన్నారు. విజయవాడ అమ్మ కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ సమావేశంలో రీజియన్ లోని 12 క్లబ్బుల్లో గ్రామీణ ప్రాంతంలోని హనుమాన్ జంక్షన్ క్లబ్ అందించిన సేవలకు గాను అభినందించారు. హనుమాన్ జంక్షన్ లైన్స్ క్లబ్ బ్యానర్ ప్రజెంటేషన్ అనంతరం రీజియన్ లొ అత్యుత్తమ క్లబ్ గా నాలుగో స్థానం సాధించిన కార్యవర్గానికి ప్రశంసా పత్రం మెమెంటోలు అందజేశారు. అత్యుత్తమ అధ్యక్షుడిగా పంచకర రమేష్ చక్రవర్తి, కార్యదర్శిగా మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారిగా అక్కినేని రాఘవేంద్రరావు లకు ప్రత్యేక మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు, తక్షణ మాజీ గవర్నర్ గద్దే శేషగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కినేని శ్రీనివాస పణీంద్ర , ఆళ్ల గోపాలకృష్ణ, నందూరి శర్మ, మేడికొండ బుచ్చిబాపయ్య, కలపాల రంగారావు , బోయపాటి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ కి అభినందనలు తెలిపిన "ఆళ్ళ"



**హనుమాన్ జంక్షన్, మార్చి 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారి జి.సాయిప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించి విజయవాడ ఎం.జి. రోడ్డులోని క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కటారి కోటేశ్వరరావు కలిసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చలివేంద్రాలు ఏర్పాటు చేయండి మహాప్రభో



**విస్సన్నపేట,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో గ్రామ పంచాయతీల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్వత్ర విజ్ఞప్తి చేస్తున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా పెరగటంతో త్రాగునీటి దప్పిక కొరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పాదచారులు వాహనదారులు డిమాండ్ అధికంగా ఉన్నట్లు పలువురు తెలియజేస్తున్నారు.

# 4న అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



**కోడూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** కోడూరు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామివారి దేవాలయం నందు బుధవారం స్వామివారి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గణపతి, అయ్యప్ప మాలికాపురత్తమ్మ ఆవాహిత దేవతలకు హోమములు, అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకం, పూష్పార్చన, జరుగుతుందని చెప్పారు. భక్తులే స్వయంగా స్వామివారికి క్షీరాభిషేకం చేయవచ్చని తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# నేరేడ్మెట్‌లో 'హెల్మెట్ బ్యాంక్' అవగాహన కార్యక్రమం



ఎల్బీనగర్/వార్తప్రభ (మార్చి 2): నేరేడ్మెట్ వాయుపురిలో సోమవారం హెల్మెట్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ అవినాష్ మహంతి సూచనల మేరకు ద్విచక్ర వాహనదారుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ లక్ష్మీ తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న రైడర్లను ఆపి ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించి, ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను ఎలా రక్షిస్తుందో వివరించారు. అనంతరం 'హెల్మెట్ బ్యాంక్' ద్వారా తాత్కాలికంగా హెల్మెట్‌లు అందజేశారు. సాయంత్రం వరకు ఉపయోగించి, కొత్త హెల్మెట్ కొనుగోలు చేసిన తర్వాత వాటిని తిరిగి డిపాజిట్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సీపీ కార్యాలయం ముందు జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఓఆర్ఆర్ వద్ద భారీ డ్రగ్ రాకెట్ పట్టివేత

**- 164 కిలోల గంజాయి స్వాధీనం.**
**- ఎల్బీనగర్ డీసీపీ డా.అనురాధ, ఐపిఎస్.**







ఎల్బీనగర్)వార్తప్రభ(మార్చి 2):మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో అబ్దుల్లాపుర్మెట్ పోలీసులు భారీగా గంజాయి పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 164.86 కిలోల గంజాయిని కియా కారులో స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. నల్గొండ ధర్మకాంత సమీపంలో ఓఆర్ఆర్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 80 ప్యాకెట్లలో దాచిన గంజాయి బయటపడింది. నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్బీనగర్ డిసిపి డా. అనురాధ, ఐపీఎస్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు.

# బంజారా కాలనీ వ్యవస్థాపకుడు నరసింహ నాయక్‌కు ఘన నివాళి.



ఎల్బీనగర్/ వార్తప్రభ (మార్చి 2 ):హయత్‌నగర్‌లోని బంజారా కాలనీ వ్యవస్థాపకులు క్రీ.శే. వద్త్య నరసింహ నాయక్ 14వ వర్ధంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహ నాయక్ కాలనీ అభివృద్ధికి పునాది వేసిన మహనీయుడని కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కాలనీ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**డిప్యూటీ కమిషనర్ ఆదేశం**





శేరిలింగంపల్లి,మార్చి 2 (వార్తాప్రభ): జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో సోమవారం మియాపూర్ 48 సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.శశి రేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సెక్షన్ ఏఎంసీ విజయ్ కుమార్,టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రమేష్, డిఈ (ఎస్‌డబ్ల్యుఎం) వశిధర్,ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఎస్ శ్రీనివాస్,ఎఫ్ఎస్ఓ శ్రుతి గౌడ్‌తో పాటు ఇంజినీరింగ్, ఎంటమాలజీ, వెటర్నరీ, యూబీడీ,యూసీడీ,ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 13, ఇంజినీరింగ్‌కు 4 ఫిర్యాదులు ఉండగా, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

# రసాయనాలు వద్దు - సహజ రంగులే ముద్దు!!

● హరిత హోలీ.. ఆరోగ్యానికి మేలు ● పర్యావరణ హితమే లక్ష్యం ● డిగ్రీ విద్యార్థుల వినూత్న ప్రచారం









పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 2 (వార్తాప్రభ ప్రతినిధి)రసాయనాలు వద్దు - సహజ రంగులే ముద్దు అని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రజలకు చైతన్యం కలుగజేశారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో హోలీ పండుగను పురస్కరించుకొని సహజ రంగుల వినియోగంపై విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీ, పంపిణీ కార్యక్రమం పలువురిని ఆలోచింపచేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు "సహజ రంగులే మేలు", "హరిత హోలీ" వంటి నినాదాలతో స్థానిక బస్‌స్టాండ్ ప్రాంతంలో ప్రదర్శన నిర్వహించి, కృత్రిమ రసాయన రంగుల వల్ల కలిగే చర్మ అలర్జీలు, కంటి సమస్యల పట్ల ప్రజలను అప్రమత్తం చేశారు. పుష్పాలు, పసుపు, చందనం, బీట్‌రూట్ వంటి ప్రకృతి సిద్ధమైన వనరులతో తయారైన రంగులు చర్మానికి, పర్యావరణానికి ఎంతో సురక్షితమని వివరిస్తూ, ప్రజలకు సహజ రంగులను ఉచితంగా పంపిణీ చేశారు. రసాయన రంగుల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన రీతిలో పండుగ జరుపుకోవాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ హితమైన హోలీపై అవగాహన కల్పించారు.

# ప్రజాబంధు శ్రీపాద రావు!!

● సభా గౌరవాన్ని కాపాడిన ధీశాలి ● విలువలతో కూడిన రాజకీయాలకు నిలువుటద్దం
● సర్పంచ్ నుండి స్పీకర్ వరకు ఆదర్శం ● బడుగు, బలహీన వర్గాల గళం ● రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్ జనక్ ప్రసాద్





పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 2 (వార్తాప్రభ ప్రతినిధి)ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు ప్రజాబంధు అని, ప్రజాస్వామ్య శిఖరం అని రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కొనియాడారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో సింగరేణి ఆర్జీవన్ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీపాద రావు 89వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనక్ ప్రసాద్, శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....శ్రీపాద రావు సర్పంచ్ స్థాయి నుండి స్పీకర్ వరకు ఎదిగి, బడుగు-బలహీన వర్గాల గళంగా నిలిచి సభా గౌరవాన్ని కాపాడిన గొప్ప ప్రజాస్వామ్యవాది అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్రాభివృద్ధికి, శ్రీను బాబు ప్రజా సేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. ఆర్జీవన్ వైస్ ప్రెసిడెంట్ సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ధర్మపురి, వికాస్ కుమార్ యాదవ్, లక్ష్మీపతి గౌడ్, ట్రైసన్ శ్రీను పాల్గొని శ్రీపాద రావు కార్మికులు, రైతుల సంక్షేమం కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు.

# 19వ డివిజన్ ప్రజల గుండెల్లో నిలిచిపోనున్న డాక్టర్ స్వప్న

**19వ డివిజన్ గర్భిణీలకు ఉచిత డెలివరీ ప్రకటించిన కార్పొరేటర్ డాక్టర్ స్వప్న**



కొత్తగూడెం, మార్చి 2 వార్తప్రభ(ప్రతినిధి ):కొత్తగూడెంలో ప్రముఖ డాక్టర్లుగా డాక్టర్ స్వప్న డాక్టర్ శంకర్ నాయకులు ప్రజలందరికీ సుపరిచితులే సేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి 19వ డివిజన్ నుండి మొట్టమొదటి కార్పొరేటర్ గా ఘనవిజయం సాధించారు డివిజన్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ తనదైన శైలిలో దూసుకు వెళుతున్న కార్పొరేటర్ స్వప్న మరో అడుగు ముందుకు వేసి 19వ డివిజన్ గర్భిణీ స్త్రీలకు ఉచిత డెలివరీ పథకాన్ని ప్రకటించి తండా డివిజన్ వాసుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కేతావత్ స్వప్న. కొత్తగూడెం విద్యానగర్ మెయిన్ రోడ్డు లో న్యూ లైఫ్ హాస్పిటల్ నందు 19 డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ కేతవత్ స్వప్న భూక్య వెన్నెల అనే చిట్టి రామవరం తండ గ్రామస్తురాలకి ఉచితంగా డెలివరీ చేసినారు. ఈ సందర్భంగా 19వ డివిజన్లో ఉన్న గర్భిణీ స్త్రీలకు ఉచితంగా డెలివరీ చేయబడుతుందని ఉచితంగా చేసే సేవలను 19వ డివిజన్లో ఉన్న గర్భిణీ స్త్రీలు అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేసినారు వారి సేవలకు స్థానిక ప్రజలు గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు

# సిసి రోడ్ల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుంది

**అధికారులు తక్షణమే స్పందించాలి**
**బిజెపి అధ్యక్షుడు కైతాపురం జితేందర్**





శేరిలింగంపల్లి,మార్చి 2 (వార్తాప్రభ): హఫీజ్ పేట్ డివిజన్ కీలక ప్రాంతాలలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని బీజేపీ హఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆరోపించారు. సోమవారం కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ హుడా కాలనీ, గంగారాం గ్రామం, సాయి నగర్, హఫీజ్ పేట్ గ్రామం, కుమ్మర బస్తీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు దారుణ స్థితిలో ఉన్నాయని తెలిపారు. రోడ్లపై పగుళ్లు ఏర్పడి నడవలేని పరిస్థితి నెలకొన్నదని, వాహనాల రాకపోకలు కూడా కష్టసాధ్యంగా మారాయని చెప్పారు. ప్రజలు నిత్యం ఉపయోగించే రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గతంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పనులు ప్రారంభించలేదని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తరఫున వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మియాపూర్ డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులకు తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించి, పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ అజిత్ సేనాపతి, హఫీజ్ పేట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రావు, సీనియర్ నాయకులు వనమా శ్రీనివాస్ గుప్తా, మోహన్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, టి. శివ, ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు అశోక్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, అశోక్ కుమార్, హరీష్, చందు, నారాయణ, నరసింహ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# స్నాచింగ్ కేసును వేగవంతంగా ఛేధించిన పోలీసులు

**ఇద్దరు నిందితులు అరెస్టు.**



శేరిలింగంపల్లి,మార్చి 2 (వార్తాప్రభ):మియాపూర్‌లో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి,దొంగిలించిన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. గత నెల 25న మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన మహిళ కళాశాల రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా,బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న సుమారు 70 గ్రాముల మంగళసూత్రాన్ని లాగి పరారయ్యారు. అందులో 10 గ్రాముల బంగారం దుండగులు అపహరించగా,మిగిలిన భాగం బాధితురాలి వద్దే మిగిలింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలు,సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు చేపట్టి పైపులైన్ రోడ్ ప్రాంతంలో నివసిస్తున్న అభయ్ కుమార్ ధుబే (30), ఆకాశ్ కుమార్ రాజక్ (18)లను అదుపులోకి తీసుకున్నారు. నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ డెలివరీ పేరుతో సంచరిస్తూ ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## వార్తా ప్రభ హైదరాబాద్

# వెల్దండ బర్కత్పల్లి సర్పంచి సహా గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరిక


**- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**



ఎల్బీనగర్/ వార్తప్రభ(మార్చి ౦2):వెల్దండ మండలం బర్కత్పల్లి గ్రామ సర్పంచి మల్కేడి నవ్య రాజు, వార్డ్ మెంబర్లు మొగిలి జంగయ్య, కోడెల సంతోష, గొడుగు అలివేలు శ్రీను,గొడుగు నర్సింహా, గొడుగు కొండల్ తదితరులు సోమవారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటయ్య, కృష్ణ, ఎనుముల శేఖర్ రెడ్డి, లచ్చిరాం, మార్కెట్ డైరెక్టర్ రాజశేఖర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 299 మంది దొరికారు!

**- ట్రాఫిక్ పోలీస్ అధికారులు.**





| S.no | VIOLATION | CHALLANS IMPOSED |
|---|---|---|
| 1 | Cell phone Driving | 1015 |
| 2 | Triple Riding | 1824 |
| 3 | Over Speed | 1401 |
| 4 | Signal Jump | 2648 |
| 5 | Wrong Side Drive | 10086 |
| 6 | Obstruction of Carriageway | 8178 |

DRUNK & DRIVE CASES

| S.NO | POLICE STATION | BOOKED |
|---|---|---|
| 1 | Tr.PS Begumpet | 24 |
| 2 | Tr.PS Trimulgerry | 33 |
| 3 | Tr.PS Gopalapuram | 11 |
| 4 | Tr.PS Alwal | 14 |
| 5 | Tr.PS Malkajgiri | 39 |
| 6 | Tr.PS Jawaharnagar | 0 |
| 7 | Tr.PS Uppal | 19 |
| 8 | Tr.PS Kushaiguda | 65 |
| 9 | Tr.PS Ghatkesar | 14 |
| 10 | Tr.PS L B Nagar | 44 |
| 11 | Tr.PS Vanasthalipuram | 36 |
| | TOTAL | 299 |

ఎల్బీనగర్/వార్తప్రభ (మార్చి 2):వారాంతం కావడంతో మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా మందుబాబులు పట్టుబడ్డారు. మొత్తం 299 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోగా.. వారిలో 256 మంది టూ వీలర్, 30 మంది ఫోర్ వీలర్, మిగతా వారు ఆటోలు, భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# ఆమనగల్ లో కాంగ్రెస్ నేత శ్రీధర్ రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాళి.



ఎల్బీనగర్ /వార్తప్రభ (మార్చి2 ): అమనగల్ మండలం పోలేపల్లికి చెందిన కాంగ్రెస్ నేత కళ్ళు శ్రీధర్ రెడ్డి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక కల్యాణం కోసం ధార్మిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయం.

**కాంగ్రెస్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్**



శేరిలింగంపల్లి,మార్చి 2 (వార్తాప్రభ):హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్మెంట్‌లో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ 26వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా హఫీజ్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని,లోకకళ్యాణం కోసం ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ గౌడ్,గురు ప్రసాద్,రాము గౌడ్,బ్రహ్మానంద రెడ్డి, శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను తక్షణం పరిష్కరించాలి

అదిలాబాద్ మార్చి 02 (వార్తాప్రభ)ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని,జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు.

# ఎడిటోరియల్

## అంతవరకూ యుద్ధమాగదు... ఎందుకంటే ?

ఇరాన్ మీద ఇజ్రాయెల్ అమెరికా సంయుక్తంగా చేస్తున్న యుద్ధం ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. సాధారణంగా యుద్ధంలో శత్రు పక్షంలోని అధినేతను హతమార్చడంతో ముగుస్తాయి. కానీ ఇక్కడ యుద్ధం రివర్స్ లో మొదలైంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని తొలి రోజే తొలి గంటలలోనే హతమార్చారు ఆయన చుట్టూ ఉన్న వారిని ఇరాన్ పాలనాలో కీలకమైన వారిని హతమార్చారు. నిజానికి చూస్తే తొలి గంటలలోనే ఇరాన్ నాయకత్వాన్ని మట్టుబెట్టారు. దాంతో యుద్ధం ఆగిపోతుంది అని అంతా అనుకున్నారు కానీ యుద్ధం మరింత భీకరంగా కొనసాగుతోంది. దానికి కారణాలు చాలానే ఉన్నాయని అంటున్నారు. ఈ ప్రపంచంలోని ముస్లిం దేశాలలో అధికారికంగా అణ్వాయుధాలు కలిగిన ఒకే ఒక దేశం పాకిస్తాన్. మరే ముస్లిం దేశానికి అణు ఆయుధాలు లేవు, ఉండరాదు అన్నది విధానంగా అగ్ర రాజ్యం పెట్టుకున్నట్లు ఉంది. ఇక ఇరాన్ విషయానికి వస్తే ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేస్తోంది అన్నది అమెరికా తీవ్రమైన ఆరోపణ. అయితే ఇరాన్ ప్రస్తుతం అధికారికంగా అణు విధ్వంసక ఆయుధాలను కలిగి ఉన్నట్లు అయితే ఎవరికీ తెలియదు. ఇదిలా ఉంటే 1980ల చివరి నుంచి 2003 వరకూ చూస్తే ఇరాన్ అణ్వాయుధాలను పోగు చేస్తోంది అన్నది యునైటెడ్ స్టేట్స్ ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ 2007లో అంచనా వేసింది. 2010 నుండి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భాగంగా ఇరాన్ అణు వ్యవహారాలపైన మరిన్ని అనుమానాలు వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ఇరాన్ అణు కార్యక్రమాన్ని రహస్యంగా చేస్తోంది అని అనుమానాలను వ్యక్తం చేయడమూ జరిగింది. : ఇదిలా ఉంటే 2025 జూన్ ప్రాంతంలో ఇజ్రాయెల్ ఇరాన్ సైనిక నాయకులు అణు శాస్త్రవేత్తలు అణు సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులను ప్రారంభించింది, ఇది పన్నెండు రోజుల పాటు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధంగా మారింది. ఇక జూన్ 22న యునైటెడ్ స్టేట్స్ ఇరాన్ అణు ప్రదేశాల మీద పెద్ద బంకర్-బస్టర్ బాంబుల మీద బాంబు దాడి చేసింది తరువాత ఇరాన్ తన అణు కార్యకలాపాలను నిలిపివేసిందని చెబుతారు. ఏది ఏమైనా ఇరాన్ అణు కార్యక్రమాల మీద అమెరికాకు ఇజ్రాయెల్ కి ఎన్నో అనుమానాలు ఉన్నాయి. దాంతోనే ఈ యుద్ధం అంటున్నారు. ఈ యుద్ధంతో ఇరాన్ అణు కార్యక్రమాలనే కాదు ఆర్థిక కార్యక్రమాలను పూర్తిగా దెబ్బ తీయాలన్న లక్ష్యం ఉందని అంటున్నారు. ఇరాన్ ఇప్పటప్పట్లో కోలుకోలేని విధంగా ఆర్థికంగా దెబ్బ తీస్తేనే తప్ప దారికి రాదు అన్న ఆలోచన ఉంది. అందుకే ఈ జాయింట్ ఆపరేషన్ అని చెబుతున్నారు. ఖమేనీ మరణం తరువాత కూడా భీకర యుద్ధం సాగుతోంది అంటే ఇరాన్ నడ్డి విరించేందుకే అని అంటున్నారు. మొత్తానికి ఈ యుద్ధం అయితే ఇప్పట్లో ఆగేది ఉంటుందా అన్న చర్చ అయితే సాగుతోంది.


## మానవత్వం చూపిన ఇద్దరు వ్యక్తులు

**మన్నెం రత్నమ్మకు మూడు నెలల పింఛను ఒకే సారి అందజేత సచివాలయం సిబ్బందికి, ఉడతా హాజరతయ్య కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు**



**చేజర్ల మార్చి 02 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మన్నెం రత్నమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చెన్నై లోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గత మూడు నెలలుగా చికిత్స పొందుతుంది. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆమె మూడు నెలలుగా పింఛను నగదు తీసుకోక పోవడంతో సమాచారం తెలుసుకున్న గొల్లపల్లి గ్రామ సీనియర్ టిడిపి నాయకులు ఉడత హాజరత్తయ్య వెంటనే సచివాలయం సిబ్బంది అయిన వెల్ఫేర్ అసిస్టెంట్ షాన్వాజ్ ను చెన్నై కు పంపించి ఆమెకు రావాల్సిన మూడు నెలల పింఛను నగదును వారికి స్వయంగా అందజేయడం జరిగింది.మానవత్వంతో సచివాలయ సిబ్బంది మరియు గొల్లపల్లి గ్రామ సీనియర్ టిడిపి నాయకులు ఉడత హాజరత్తయ్య పింఛను నగదును వారికి స్వయంగా అందజేయడం జరిగింది.పింఛను అందుకున్న ఆమె ఒక్కసారిగా ఆమె ముఖంలో చిరునవ్వు నవ్వుతుంటే ఆమె ను చూసి వారి కుటుంబ సభ్యులు సచివాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు

## జీవితంలో రేడు



పనిచేసే వాడు
ప్రచారం ఇష్టపడడు
శ్రద్ధగా ఉన్నోడు
ఎప్పుడు నష్టపోడు
చురుగ్గా ఉన్నోడు
బద్ధకం ఒప్పుకోడు
సత్యం పలుకువాడు
అబద్దమే చెప్పడు
నీతిగా ఉన్నోడు
జ్యోతిలా ఎదుగుతాడు
ప్రీతిని పంచువాడు
ఖ్యాతిని పొందుతాడు
మాటపై ఉన్నోడు
గౌరవానికర్హుడు
ఆదర్శవంతుడే
జీవితంలో రేడే

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు
,సెల్: 9966414580

# ప్రజా ఫిర్యాదులకు నిర్ణీత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాలను అందిస్తున్నాం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా ఫిర్యాదులకు నిర్ణిత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాలను అందిస్తున్నాం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో నిర్వహించారు. జోనల్ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి స్వీకరించి ఫిర్యాదులకు అధికారులు అందరూ నిర్ణీత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకవైపు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా మరోవైపు అధికారులతో సమీక్షించారు. నిరంతరం దోమల నిర్మూలన చర్యలు చేపడుతూనే ఉండాలని, ప్రతిరోజు త్రాగునీటి పరీక్షలు చేస్తుండాలని, ప్రణాళిక బద్ధంగా వాటర్ ట్యాంకులను కడుగుతుండాలని, పన్ను వసూళ్లు సమర్ధవంతంగా చేయాలని అధికారులందరూ తమ తమ సిబ్బంది మీ పర్యవేక్షిస్తూ నగరాభివృద్ధిలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని కమిషనర్ అన్నారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 22 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 6, ఇంజనీరింగ్ 7, రెవిన్యూ 6, పి ఒ యుసిడి 1, హౌసింగ్ 1, హార్టికల్చర్ 1 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, సూపర్డెంట్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఆర్ ఎఫ్ ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా..... ఎస్ .హెచ్. ఓ. లో అతి తక్కువ ఖర్చుకే మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు

**గుంటూరు టౌన్ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా.... అతి తక్కువ ఖర్చుతో "మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు" నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టీ .సేవకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, 2/1 బ్రాడీపేట లోని ఎస్. హెచ్ .ఓ .స్పెషాలిటీ ల్యాబ్స్ ,మైప్యాత్ డయాగ్నొస్టిక్స్ సహకారంతో నిర్వహించే ఈ పరీక్షలలో కంప్లీట్ హెల్త్ చెకప్( 86 పరీక్షలు) ఇన్ ఫెర్టిలిటీ ప్రొఫైల్, అనీమియా ప్రొఫైల్ ,క్యాన్సర్ బయో మార్కర్స్ ,థైరాయిడ్, ప్రొలాక్టిన్,ఎల్ .హెచ్ ,ఎఫ్. ఎస్ .హెచ్ వంటి అన్ని రకాల హార్మోన్ పరీక్షలు ,థైరాయిడ్, రొమ్ము (బ్రెస్ట్ ),సర్విక్స్ (గర్భాశయం ముఖద్వారం), యుటిరస్ ( గర్భాశయ ),ఓవరీ (అండాశయ) క్యాన్సర్లకు సంబంధించిన ఎఫ్. ఎన్. ఎ .సి ,మెమోగ్రామ్ ,అల్ట్రా సౌండ్ స్కానింగ్ వంటి పరీక్షలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 2/1 బ్రాడీపేట లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో గానీ, 0863-2242995 ఫోన్ నెంబర్ లో గాని సంప్రదించవచ్చునన్నారు.

# ఏజెంటిక్ ఏఐతో విప్లవాత్మక మార్పులు






**విజయవాడ పశ్చిమ, మార్చి 2:(వార్తా ప్రభ ప్రతినిధి)**భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డిజైన్, కంటెంట్ క్రియేషన్, రీసెర్చ్ తదితర రంగాల్లో ఏజెంటిక్ ఏఐ విప్లవాత్మక మార్పులకు దారి తీస్తుందని అమెరికాకు చెందిన బేకన్ మొబిలిటీ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గౌరవ్ శ్రద్ధ అన్నారు. కెబిఎన్ కళాశాల పిజి డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యాన సోమవారం వర్చువల్ విధానంలో 'జెనరేటివ్ ఏఐ అండ్ ఏజెంటిక్ ఏఐ' అనే అంశం మీద గెస్ట్ లెక్చర్ జరిగింది. గౌరవ్ మాట్లాడుతూ ఏజెంటిక్ ఏఐ వల్ల సాఫ్ట్‌వేర్ డెవలపర్ల పాత్ర స్వభావం మారుతోందని, ఇప్పటివరకు కోడ్‌ను పూర్తిగా మనుషులు రాస్తే, ఇప్పుడు ఏఐ తో కలిసి పని చేసే "ఏఐ అసిస్టెడ్ డవలప్మెంట్' అనే కొత్త విధానం వ్యాప్తిలోకి వస్తోందన్నారు. సమస్యను అర్థం చేసుకోవడం, సరైన లాజిక్‌ను రూపొందించడం, సిస్టమ్ డిజైన్ చేయడం వంటి ఉన్నత స్థాయి నైపుణ్యాలు ప్రధాన అవసరాలుగా మారుతున్నాయన్నారు. భవిష్యత్తులో ప్రోగ్రామర్ కేవలం కోడ్ రాసే వ్యక్తిగా కాకుండా సమస్యలను పరిష్కరించే ఆలోచనశక్తి కలిగిన టెక్నాలజీ ఆర్కిటెక్ట్‌గా మారాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. అమెరికాకు చెందిన మిరాకిల్ సాఫ్ట్వేర్ సిస్టమ్స్ ఇంటిలిజెంట్ ఆటోమేషన్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ తంగిరాల అంజిరెడ్డి మాట్లాడుతూ జెనరేటివ్ ఏఐ కంటెంట్‌ను సృష్టిస్తే, ఏజెంటిక్ ఏఐ స్వతంత్రంగా లక్ష్యాలను అర్థం చేసుకుని వాటిని సాధించేందుకు చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. ఇది కేవలం ప్రశ్నకు సమాధానం చెప్పే వ్యవస్థగా కాకుండా, ఒక టాస్క్‌ను పూర్తిచేసే వరకు ప్రణాళిక రూపొందించి, నిర్ణయాలు తీసుకుని, అవసరమైతే ఇతర టూల్స్‌ను ఉపయోగించి పని పూర్తి చేసే డిజిటల్ ఏజెంట్‌గా పనిచేస్తుందన్నారు. విద్యార్థులు కేవలం ప్రోగ్రామింగ్ భాషలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా, సమస్య పరిష్కార నైపుణ్యాలు, డేటా అవగాహన, సిస్టమ్ థింకింగ్ తో పాటు ఏఐతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఏఐని నైతికంగా ఉపయోగించడం, డేటా గోప్యతను కాపాడటం, మానవ విలువలను గౌరవించడం వంటి అంశాలు కూడా ముఖ్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత శక్తివంతమైతే, దాని వినియోగం అంత బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. విభాగాధిపతి డాక్టర్ వి.టి.రామ్ పవన్ మల్లాది మాట్లాడుతూ జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ అనేవి భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి పునాది వేస్తున్న విప్లవాత్మక దశలని, ఈ మార్పులను అర్థం చేసుకుని, వాటికి అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విద్యార్థులే రేపటి టెక్నాలజీ నాయకులు అవుతారన్నారు. పిజి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేశ్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం కొట్లాడే కమ్యూనిస్టులకు పేదవారే పెద్ద దిక్కు..

**.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య**



**విజయవాడ పశ్చిమ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నిరంతరం పేద ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీకి పేదలే అండగా ఉంటున్నారని వారి ప్రోత్సాహంతోనే వందేళ్లుగా ఈ ప్రస్థానం సాగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు.సోమవారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వన్ టౌన్ ప్రాతంలోని 47 వ డివిజన్ పరిధిలో విస్తృతంగా పర్యటించి "గడప గడపకు సిపిఐ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈ వందేళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను చవిచూసినప్పటికీ ఆదరక, బెదరక కమ్యూనిస్టులు ముందుకు సాగుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, దోపిడి వ్యవస్థపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ కి ప్రజలు ఆర్థిక తోర్పాటును అందించి కమ్యూనిస్టు శ్రేణులకు పోత్సాహాన్ని అందించాలని విజ్ఞప్తి చేసారు. ప్రజాస్వామ్య పరిరక్షణ అలుపెరుగని పోరాటాలు చేస్తూ నిత్యం ప్రజల కోసం పరితపించే కమ్యూనిస్టు పార్టీల పట్ల ప్రజలకు సమ్మకం ఉందని వారి సమస్యల పరిష్కారానికి నడుంకట్టిన కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు ప్రజలు తమ విరాళాల ద్వారా అభిమానాన్ని చాటుతున్నారనని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగర సమగ్ర అభివృదిలో ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉండే వన్ టౌన్ కొండప్రాంత ప్రజలకు, ఇళ్ల పట్టాలు,మౌలిక వసతులు కల్పించిన ఘనత సిపిఐకే దక్కుతుందని అన్నారు, కమ్యూనిస్టులు ఎల్లవేళలా ప్రజా పక్షంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలలో ఉండే కమ్యూనిస్టు పార్టీ నాయకుల పట్ల ప్రజలు ఆదరాభిమానాలు చూపిస్తూ విరివిరిగా ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని ఇదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని స్థానిక నాయకత్వం ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భముగా స్థానికంగా నివాసం ఉంటూ కొంతకాలంగా వృధాప్యంతో అస్వస్థతకు గురైన నగర పార్టీ సీనియర్ నాయకులు ఆర్.యాకుబ్ ని ఈశ్వరయ్య మరియు కోటేశ్వరరావులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు డి.వి.రమణ బాబు, ఎస్.కె.నజీర్,ఆర్.మైఖేల్ చీర్ల రామస్వామి,బెవర శ్రీనివాసరావు, షైక్ అమీర్,వి.రామారావు, ఎన్.సూరిబాబు, షైక్ అల్లాబక్షు, ఐ.రత్న శేఖర్, కె.మల్లేశ్వరరావు, షైక్ మాబు, కె.పౌల్, సిహెచ్.బెనర్జీ, షబ్బార్, ఎస్.వి.రమణ, ఆర్.అనసూయ తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్( ఏఐటియుసి) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

**విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా పిలుపు**



**విజయవాడ పశ్చిమ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి )** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు మార్చి 16,17,18 తేదీలలో రాజమండ్రిలో జరగనున్నాయని ఈ మహాసభలు జయప్రదం చేయాలని సోమవారం ఉదయం 40 వ డివిజన్ సానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్లో విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐటియుసి అని కొనియాడారు. సంఘం మహాసభ 3 రోజులపాటు రాజమండ్రిలో జరగనున్నాయని 16వ తేదీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. 17 18 తేదీలలో ప్రతిరూధుల సభ జరుగుతుందని ఈ సభలో కార్మిక సమస్యల మీద అనేక తీర్మానాలు చేసి ఉద్యమించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ మహాసభ జై ప్రధానికి నగరం నుండి వందలాది మంది కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జక్కి జేమ్స్, అధ్యక్షులు ఎస్వీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 3,4, తేదీలలో ఎస్ హెచ్ ఓ లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన

**గుంటూరు టౌన్ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నేచర్ ఫోటోగ్రాఫర్ టి.ఎన్. వరప్రసాద్ సహకారంతో ప్రకృతి ,పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 2/1 బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో మార్చి 3,4 తేదీలలో"ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన "నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి .సేవకుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు.3తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభోత్సవ సభలో ప్రఖ్యాత వైద్యులు ,ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ డాక్టర్ ఎన్ వెంకటరమణ ,జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ (పట్వా) అధ్యక్ష కార్యదర్శులు, ఎన్. సతీష్ కుమార్, ఎం .రవి కుమార్ ,పట్వా గౌరవ సలహాదారు కె. కృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు.. ఈ ప్రదర్శనలో ప్రకృతి ఫోటోగ్రఫీలో ఆసక్తి గలవారికి టి .ఎన్ .వరప్రసాద్ మెళుకవలు తెలుపుతారన్నారు .ప్రజలు అధిక సంఖ్యలో ప్రదర్శన సందర్శించి విజయవంతం చేయాలని డాక్టర్ టి . సేవ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

## 41 వ,డివిజన్ లో జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వ నమోదు



**విజయవాడ పశ్చిమ మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**41డివిజన్ అధ్యక్షులు సురేష్ కూరాకుల ఆధ్వర్యంలో సోమవారం జనసేన క్రియాశీలక సభ్యత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ జనసేన పార్టీఉద్యమి "కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పశ్చిమ నియోజకవర్గం సీనియర్ నాయకులు ఆజయ్ వర్మ తాగూర, నగర సంయుక్త కార్యదర్శి తిరునగారి మురళీకృష్ణ, జనసైనికులు,వీర మహిళలు ముఖ్య నేతలు పాల్గొన్నారు..

## వసంత నవరాత్రులు నిర్వహించుకోవాలి

**బాపట్ల జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ**




**చెరుకుపల్లి మండలం మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం పొన్నపల్లి శివాలయం లో జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు హిందువుల లో కుల భేదాలు లేకుండా ఐక్యత సాధిస్తూ హిందూ ధర్మ రక్షణకు పాటుబడాలని అన్నారు. ఫిబ్రవరి 3,4 తేదీలు పౌర్ణమి సామూహిక హారతులు, 1తేదీ నుండి 6వ తేదీ వరకు మండల సమావేశాలు, 14వ తేదీ రెండవ శనివారం సత్సంగం ,14, 29 తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. ఉగాది 19వ తేదీ నుండి శ్రీరామనవమి 27వ తేదీ వరకు వసంత నవరాత్రులు ప్రతి దేవాలయాలలో రామాలయాలలో భజన సంకీర్తనలు సత్సంగాలు సాంస్కృతి కార్యక్రమాలు శోభాయాత్రలు వసంత నవరాత్రులుగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ సంబంధాల ప్రముఖ్ బొలగాని వెంకటేశ్వర్లు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు,ఖండ్ కన్వీనర్ క్రాప రవికుమార్, బయ్యన వెంకట్రావు,ధర్మ ప్రచారకులు చింతల మురళీకృష్ణ,దండుప్రోలు వెంకట్రావు, తులసి రాజేష్, మోదడుగు సూరిబాబు,యల్లావుల అంకమ్మరావు యేమినేని శ్రీనివాసరావు, చిట్టా రాముడు, అమ్మిరాజు సాయిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న క్లైమ్‌లన్నిటిని చెల్లించాలి

## పాత పథకాలు అన్నిటిని కొనసాగించాలి

## బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్



**పెనుగంచిప్రోలు, మార్చి 2( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలోని భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుండి భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ప్రసూతి కానుక, పెళ్ళికానుక, సహజ మరణానికి పరిహారం, మట్టి ఖర్చుల వంటి 4 పథకాలను అమలు చేయడానికి నిర్ణయించినట్టుగా మెమో నెంబర్.బిసీ డబ్ల్యూ బి -14021/4/2026-డీ.విడుదల చేసింది. కానీ భవన నిర్మాణ కార్మికుల కోరుకునేది గతంలో 2019 వరకు ఏవైతే పథకాలు అమలు జరిగాయో ఆ పథకాలన్నీ అమలు చేయాలి.అలాగే 2020వరకు స్క్రూట్ ని కమిటీలు ఆమోదించిన క్లయములను చెల్లించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దాంతోపాటుగా ప్రభుత్వం 2020 నుంచి ఆరు సంవత్సరాల కాలంలో ఏ విధమైన క్లైములు పరిష్కారం చేయకుండా బోర్డు పథకాలను ప్రభుత్వమే ఆపేసినది . కాబట్టి ప్రభుత్వంసంక్షేమ బోర్డ్ పునరుద్ధరిస్తున్న సందర్భంలో ఆపిన నాటి నుండి కూడా క్లైములు ఇవ్వడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆ విధంగా కాకుండా మార్చి ఒకటి నుండి క నాలుగు పథకాలు పనిచేస్తాయి అని ప్రకటించటం అనేది భవన నిర్మాణ కార్మికులకు దగా చేయడమే.నిర్మాణ కార్మికులకు పాత క్లైములు పరిష్కారం చేయాలని ఆపేసిన నాటి నుంచి ఉన్న పెండింగ్లో ఉన్న క్లైములు మంజూరు చేయాలని పాత పథకాలు అన్నిటిని కొనసాగించాలని సంతకాల సేకరణ బిల్డింగ్ వర్కర్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించడం జరిగింది. వీటిని పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు అనిగండ్లపాడు గ్రామాల్లో సంతకాలు సేకరణ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఏ వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి పుట్టేపు అప్పారావు, పెనుగంచిప్రోలు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీర్ల నరసింహారావు,బి నరసింహారావు ,సిఐటియు కార్యదర్శి ధారా నాగేశ్వరావు, అనిగండ్లపాడు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి కోటేశ్వరావు,కార్యదర్శి అప్పారావు మరియు భవన నిర్మాణ కార్మికుల పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.సోమవారం కలెక్టరు చాంబర్ నందు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జిల్లావ్యాప్తంగా మంజూరైన అక్రిడిటేషన్ కార్డులు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్రిటేషన్ కార్డులు మంజూరైన విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం.

## ఎమ్మెల్యే శ్రీ రాం రాజగోపాల్ తాతయ్య



**పెనుగంచిప్రోలు, మార్చి2( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో విజయవాడ స్రవంతి హాస్పిటల్ డాక్టర్ల బృందంతో ఉచిత వైద్య శిబిరం 270 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినారు. ఈ శిబిరం లో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదవారికి ఉచిత వైద్య శిబిరాలు చాలా ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. స్రవంతి హాస్పటల్ డాక్టర్ విజయ్ శ్రీనివాస్ తో పాటు డాక్టర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసి చైర్మన్ వేగినటి గోపాలకృష్ణమూర్తి సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ ఉమ్మనేని పుల్లారావు మండల సమైక్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి శ్రీ లక్ష్మి తిరుపతమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్ బాబు మాజీ జడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు నల్లపునేని కొండ విజయవాడ తెదేపా పార్లమెంటరీ అధికార ప్రతినిధి నల్లమోలు శివరామ వర ప్రసాద్ మాజీ ఎంపీటీసీ కాకానిబ్రహ్మాం గుగులోతు రమేష్ కొలిపాక బ్రహ్మాం మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ అజాద్ మురుకుట్ల వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు...

# దేశ ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగానిది ప్రముఖ పాత్ర :కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి. :మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేశ ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగం ప్రముఖమైన పాత్ర పోషిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ అనుబంధ టెక్సటైల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భీమాస్ హోటల్ నందు నిర్వహించిన “మార్కెట్ ఫర్ టెక్స్టైల్స్ అండ్ క్లాథింగ్ (ఎంసీటీ)” జాతీయ గృహ సర్వే శిక్షణా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వస్త్ర రంగం వలన ఉద్యోగ, ఉపాధికి ఎక్కువ అవకాశం ఉండన్నారు. ఈ పరిశ్రమల ఉత్పత్తిలో సుమారు 13 శాతం, జీడీపీకి 4 శాతం వంతు ఇస్తోందన్నారు. దేశంలో సుమారు 4.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ, ఎగుమతుల్లో 12 శాతం వాటా కలిగి ఉందని చెప్పారు. టెక్స్టైల్స్ కమిటీ 1969 నుంచి నిర్వహిస్తున్న “మార్కెట్ ఫర్ టెక్స్టైల్స్ అండ్ క్లాథింగ్ (ఎంసీటీ)” జాతీయ గృహ సర్వే నివేదిక దేశంలో ప్రత్యేకమని తెలిపారు. దేశం వ్యాప్తంగా ఈ సర్వే ద్వారా గృహాల స్థాయిలో వస్త్ర వినియోగంపై వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఆదాయ వర్గాలు, పురుషులు, మహిళలు వంటి అంశాల వారీగా వినియోగ ధోరణులను ఈ నివేదిక ద్వారా తెలుస్తుందని తెలిపారు. ఈ సంస్థ 2024లో తొలిసారిగా రీయూజ్, రీసైకిల్ చేసిన వస్త్రాల మార్కెట్ పరిమాణాన్ని కూడా అంచనా వేసినట్లు తెలిపారు. పలు రకాల అంశాలను కూడా సర్వేలో చేర్చుతున్నారని చెప్పారు. దక్షిణ రాష్ట్రాల నుంచి 60 మంది లైజన్ అధికారులు 3,050 ప్యానెల్ గృహాల నుంచి 23 పట్టణాలు, 60 గ్రామీణ కేంద్రాల్లో డేటా సేకరిస్తున్నారని తెలిపారు. ఈ రెండురోజుల శిక్షణ కార్యక్రమం సర్వే చేసేవారికి ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాబార్డ్ సహకారంతో దేశవ్యాప్తంగా సుమారు 150 హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ ఉత్పత్తులకు ఈ శాఖ నమోదు చేసిందని తెలిపారు. వస్త్ర రీసైక్లింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి డేటా అందితే ఆంధ్రప్రదేశ్ టెక్స్టైల్ రంగ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో టెక్సటైల్ కమిటి సెక్రటరీ కార్తికేయ, డైరెక్టర్ తపన్ కుమార్ రౌత్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వినికిడి పై ప్రత్యేక అవగాహన సదస్సు.

## ప్రపంచ వినికిడి దినోత్సవం



**మచిలీపట్నం మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. యుగంధర్ ఆధ్వర్యంలో రైల్‌పేట మున్సిపల్ పాఠశాలలో వినికిడి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్ జిల్లా నిర్వహణాధికారి డా. హిమబిందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివారించదగిన బాల్య వినికిడి లోపం, చెవి లేదా వినికిడి సమస్యలు ఉన్న పిల్లలను ముందస్తుగా గుర్తించడం వలన చెవి సంరక్షణ గురించి, వినికిడి లోపాలకు గల కారణాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం చెవి సమస్యలు గల విద్యార్థులను పరీక్షించి, తగు చికిత్సను అందించారు. అతి శబ్దాల వినడం వలన వినికిడి లోపం కలుగుతుందని ఆమె తెలిపారు. చెవులను శుభ్రం చేసేటప్పుడు ఏర్బడ్స్ మాత్రమే ఉపయోగించాలని ఇతరమైన ఉపయోగించడం వల్ల వినికిడి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. చెవి సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్లు డా. శ్రీ నిధి, డా. సాయి కిరణ్, డా. నిరీక్షణ, డా. అనూష, డా. శ్రీజ , ఆర్బీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ జెఎసి ప్రధాన కార్యదర్శి గా సయ్యద్ ఖాసీం

## ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన టీచర్స్ ఫెడరేషన్



**ఇబ్రహీంపట్నం, మార్చి02(వార్తా ప్రభ ప్రతినిధి):**ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జాక్) ఎన్టీఆర్ జిల్లా శాఖ సమావేశం గాంధీ నగర్ లోని ఏపీ ఎన్జీవో భవన్లో సోమవారం నిర్వహించారు.ఈ సమావేశంలో ఏపీ జెఎసి ఎన్టీఆర్ జిల్లా శాఖ సెక్రెటరీ జనరల్గా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ పోరాటాలలో క్రియాశీలక పాత్ర వహించి, ముందు నుండి నడిపించిన నాయకత్వ లక్షణాలతో ఖాసింకు ప్రధాన కార్యదర్శి లాంటి కీలక పదవి లభించింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొటికలపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీ మాలిని ఖాసీం ను శాలువాతో సత్కరించి అభినందన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాసిం మాట్లాడుతూ ఏపీ జెఎసి ఇచ్చిన బాధ్యతలను సమర్ధవంతంగా పనిచేసి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఏపీ జేఏసీ ఇచ్చే కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. మాలిని మాట్లాడుతూ సమర్ధవంతమైన నాయకులు ఉంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని అందుకు ఖాసిం లాంటి ఉద్యమ స్ఫూర్తి గల నాయకులు కీలక పదవి చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షులు వి నరేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ పి వి దుర్గాప్రసాద్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

# కూలీలకు ఏడాదికి 125 రోజుల పని దినాలు



**మచిలీపట్నం మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఏడాదికి 125 రోజుల పని దినాలు కల్పిస్తూ కొత్తగా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ వి.బి. జి రాంజీ పథకాన్ని వచ్చే 2026 27 ఆర్థిక సంవత్సరం నుండి అమలులోకి రానుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ రూపొందించిన వికసిద్భారత్ జి రాంజీ 125 రోజుల ఉపాధి హామీ పేరుతో గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇది గ్రామీణ అభివృద్ధికి నూతన సంకల్పం, ఉపాధికి కొత్త హామీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ దోమ పిడి శివప్రసాద్ మెప్మా పీడీ సాయిబాబు, సర్వ శిక్ష ఏపి సి కుమిదిని సింగ్, డిఎస్పి శ్రీనివాసరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# తక్షణమే మా గ్రామాలకు మంచినీటి సదుపాయాన్ని కల్పించండి



**కోడూరు, మార్చి 2( వార్తా ప్రభ) :** కోడూరు మండల పరిధిలోని ఊటగుండం, బసవానిపాలెం గ్రామాలకు గత నాలుగు రోజులుగా పంచాయతీ నీరు రావడంలేదని మంచినీటి పైపులైన్ మరమత్తు పనులు వేగవంతం చేసి నీరు కుళాయిల ద్వారా గ్రామాలకు వదిలేలా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఊటగుండం బసవానిపాలెం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా దిగు ప్రాంత గ్రామ ప్రజలు మాట్లాడుతూద్వారకా దగ్గర జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ పైపులైను మరమ్మత్తులు కారణంగా గ్రామాలకు మంచినీరు రావడంలేదని నీరు రాకపోవడంతో 5 కిలోమీటర్ల దూరం వెళ్లి వాడుకోవడానికి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. వృద్ధులు నీటి కోసం అనేక అవస్థలు పడుతున్నారు కావున మా యందు దయ ఉంచి ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి మా గ్రామాలకు మంచినీటి సమస్య లేకుండా చేయాలని కోరుచున్నారు.

# సైన్స్ లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బీజేపీ నేతల అభినందనలు



**ఇబ్రహీంపట్నం, మార్చి 2 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో జాతీయ సైన్స్ డే వారోత్సవాలను పురస్కరించుకుని 6 నుంచి 10వ తరగతి వరకు సైన్స్ లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను బీజేపీ నేతలు సోమవారం అభినందించారు. బీజేపీ సీనియర్ నాయకుడు నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాలా) ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించి పుస్తకాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. సైన్స్ డే ఆవశ్యకతను వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, ప్రధాన కార్యదర్శులు దాము భవాని, సేనాపతి నాగమణి, సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ కూనాల యుగంధర్, జి.కొండూరు మండల అధ్యక్షుడు చల్లా మల్లేశ్వరరావు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చైతన్య, రూరల్ మండల ఎస్సీ మోర్చా కల్పన, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# పలువురికి జడ్పిటిసి యాదవ రెడ్డి పరామర్శ



**కోడూరు, మార్చి 2( వార్తా ప్రభ) :** కోడూరు లో మండలం లో పలువురు మృతుల కుటుంబాలను కోడూరు జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ స్థానిక పార్టీ నేతలు కలిసి పరామర్శించారు. కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని మాజీ సర్వేయర్ దివంగత కంచర్లపల్లి వెంకటేశ్వరరావు భార్య కంచర్లపల్లి రత్నా బాయ మృతి చెందగా ఆమె యొక్క భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.యర్రరెడ్డి పాలెం గ్రామంలోని కోట రాంబాబు భార్య కోట దుర్గ మృతి చెందగా ఆమె యొక్క మృతి దేహానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీటీసీలు తిమ్మన వెంకట నాంచారయ్య, బడే హేమ గంగాధర్ రావు,కోట పద్మావతి వరప్రసాద్, విశ్వనాథని సత్యనారాయణ, బండే నాగరాజు,కటకం కుటుంబరావు,షబు తదితరులుపాల్గొన్నారు

# రెడ్ క్రాస్ ద్వారా యువతలో సామాజిక సేవలు అలవడతాయి



**గుంటూరు మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక తెలాకుల జాలయ్య పోలిశెట్టి సోమసుందరం కళాశాల ( స్వయం ప్రతిపత్తి ) లో మొదటి సంవత్సరం బి ఎస్ సి చదువుతున్న రావూరి చరణ్ సాయి మణికం ఠ, చలపాక జయరాం విద్యారులు ఫిబ్రవరి 26 నుండి 28 వరకు ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కోటప్పకొండ దగ్గరిక జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ రెడ్ క్రాస్ స్టడీ కమ్ ట్రైనింగ్ క్యాంప్ లో శిక్షణ పొందివచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు.శిక్షణ పొందిన రెడ్ క్రాస్ విద్యార్థులు మాట్లాడుతూ ప్రతి రోజు యోగ, రెడ్ క్రాస్ విలువలు గురుంచి, రక్తదానం అవగాహన గురించి, మత్తుపదార్ధాలు ఉపయోగిస్తే జరిగే నష్టాల గురించి, రోడ్డు ప్రమాదాలు ఎలా అరికట్టాలో, రోడ్డుపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సి పి ఆర్ లో శిక్షణ, కెరీర్ డెవలెప్మెంట్ గురించి, డిజాస్టర్ మేనేజ్మెంట్ గురించి, ప్రకృతి పరిరక్షణ గురించి, జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకునే మార్గాల గురించి, మానవీయ విలువలు మొదలైన అంశాల గురుంచి శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఈ శిక్షణ ద్వారా సామాజిక సేవలు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించే విషయమని చెప్పారు. శిక్షణ పొందిన కళాశాల రెడ్ క్రాస్ వాలెంటీర్స్ ని సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం మరియు గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్ లు అభినందనలు తెలియచేశారు.

# ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు



**రాజమహేంద్రవరం, మార్చి 02 ( వార్త ప్రభ )** జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, ఇతర చిన్న తరహా ఖనిజాల రవాణాపై గనుల శాఖ ప్రత్యేక దష్టి సారించిందని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. కడియం మండలం పరిధిలోని బొమ్మూరు నుండి వేమగిరి హైవేలో పలు ప్రాంతాల్లో రూట్ చెక్ నిర్వహించినట్టు తెలిపారు. పంగిడి ప్రాంతం నుండి వస్తున్న 12 రోడ్ మెటల్ లారీలు, రంగంపేట నుండి వస్తున్న 8 గ్రావెల్ లారీలు, రాఘవాపురం నుంచి వస్తున్న ఐదు ఎర్త్ రవాణా లారీలను గుర్తించబడినట్టు తెలిపారు. సరైన పత్రాలు లేని కారణంగా మొత్తం 25 వాహనాలను స్వాధీనం చేసుకుని కడియం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు.

# అన్నదానం కు పలువురు 40 వేల 318/రూపాయలు విరాళం....



**పెనుగంచిప్రోలు, మార్చి 2( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదాన పథకం కు పల్నాడు జిల్లా కారంపూడి, గోదావరిపల్లి , వాస్తవ్యులు శ్రీ హరిదాసు సాంబశివరావు వారి దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు రూ?10,116/- రూపాయలు, విజయవాడ వాస్తవ్యులు యం.కేదారేశ్వరరావు శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు రూ.10,116/- రూపాయలు, పెనుగంచిప్రోలు వాస్తవ్యులు వైపిఆర్ గార్డెన్స్ వారు వై పురుషోత్తం శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు రూ.10,116/- , పోరంకి , విజయవాడ వాస్తవ్యులు ఘంటా శ్రీకాంత్ శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు రూ.10,000/-రూపాయలను డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. మహేశ్వర రెడ్డి కీ అందజేశారు.వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు...

## బాలలపై లైంగిక వేధింపులను అరికట్టాలి




**ఇబ్రహీంపట్నం, మార్చి 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** బాలలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఆర్బీఎస్కే, ఎన్ సీడీ అండ్ సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మాధవి అన్నారు. బాలల లైంగిక దుర్వినియోగంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థూలంగా చెప్పాలంటే 16 సంవత్సరాల వయస్సు లోపు ప్రతి ఆరుగురి బాలల్లో ఒక బాలుడు పెద్దలచే లైంగిక వేధింపులకు గురవుతున్నాడని చెప్పారు. సాధారణంగా ఈ వేధింపులకు గురి చేసే వారు బాధితులకు దగ్గరవారే అయ్యి ఉంటారన్నారు. దీనిపై ఫిర్యాదులు చేయకుండా ఉండటం నష్టదాయకమని చాలా మంది బాలలకు తెలియదన్నారు. బాలల లైంగిక దుర్వినియోగం గుర్తింపు, నివారణ, నివేదిక విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ మీనా, సైకాలజిస్ట్ దుర్గారావు, ఇబ్రహీంపట్నం పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ ఫర్హీన్, ఎంఈవో సిహెచ్.పుష్పలత, సీహెచ్ వోలు, హెచ్ఎంలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## కొండపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ గా శ్రీనివాసరావు

### త్వరలో బాధ్యతల స్వీకరణ



**కొండపల్లి, మార్చి 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ గా బి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా బదిలీపై వస్తున్నారు. ఇక్కడ విజయవాడ జోనల్ – 1 కమిషనర్ బి.రమ్యకీర్తన డిప్యుటేషన్ పై కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తుండగా గత ఏడాది నవంబర్ 24న డిప్యుటేషన్ ను రద్దు చేయడంతో రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో నవంబర్ 25న ఇక్కడ మేనేజర్ గా పనిచేస్తున్న వెంకటరత్నం కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలలు తరువాత పూర్తిస్థాయిలో నూతన కమిషనర్ ను నియమించారు. ఈయన ఈ నెల 2న (సోమవారం) బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

## పాతపాడు యనమదల లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**చేజర్ల మార్చి 02 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పాతపాడు మరియు యనమదల గ్రామాలలో ప్రారంభిం చడం జరిగింది.వారి ధాన్యము గ్రేడ్ ఏ రకము క్వింటాలుకు 2389 రూపాయలు అలాగే సాధారణ రకము క్వింటాలుకు 2369 రూపాయలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం వారిచే నిర్ణయించబడింది ఈ యొక్క ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రతి రైతు వారి యొక్క నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరుకుంటున్నాము 17% తేమ శాతం ఉండాలి. 17% ఉన్నటువంటి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుంది. పాతపాడు గ్రామానికి సంబంధించి ప్రైమరీ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వీర రాఘవ రెడ్డి సర్పంచ్ చిరంజీవి రెడ్డి తర్వాత రైతులు ప్రేమ్ కుమార్ ఈశ్వర్ రెడ్డి పెంచల్ రెడ్డి పాల్గొనడం జరిగింది. అలాగే ఎనిమదల ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవానికి ప్రైమరీ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ శ్రీ వీర రాఘవరెడ్డి అలాగే రైతు సంఘ నాయకులు నోటి వెంకటరామిరెడ్డి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ శ్రీమతి హర్షిని మరియు మాధురి మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ శ్రీమతి పిఎస్ హిమబిందు పాల్గొనడం జరిగింది.

## జాతీయ సైన్స్ దినోత్సవం




**ఏలూరు,మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**"మేరా యువ భారత్–మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ " ఆధ్వర్యంలో,నేషనల్ సైన్స్ డే అనే కార్యక్రమాన్ని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఏలూరు లో నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ జి గిరిబాబు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సైన్స్ అనేది మానవ జీవితంలో ఎంత ముఖ్య పాత్ర పోషిస్తుందో మానవునికి ఏ విధంగా దోహదపడుతుందో వివరించారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటేషన్ నిర్వహించారు ఈ కాంపిటీషన్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సెట్ వెల్ సీఈవో ప్రభాకర్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ అజయ్ బాబు ,ఎకనామిక్స్ రాంబాబు గారు ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్ కుమార్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు దుర్గాప్రసాద్ రావు,అండ్ కాలేజ్ స్టాఫ్ మైభారత్ యువ వాలంటీర్ చేతన తదితరులు పాల్గొన్నారు .





.మార్కాపురం జిల్లాను "కాటమ రాజు జిల్లా"గా మార్చాలని కోరుతూ తమ డిమాండ్ ప్రభుత్వానికి తెలియాలని కోరుతూ అఖిల భారత యాదవ మహాసభ తరపున మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందచేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లు రమణారావు యాదవ్, విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పళ్ళ వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎలమంచిలి అప్పారావు తదితరులు **వార్తా ప్రభ,విశాఖపట్నం**

# వివాదాల సిఐపై హెచ్ఆర్సీ కొరడా!!

- రామగుండం సీపీకి సమన్లు జారీ
- తీరుపై విచారణకు హైకోర్టు మాజీ జడ్జి ఆదేశం
- ఏప్రిల్ 27న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 2 (వార్తాప్రభ ప్రతినిధి)**వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తున్న గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించడం, వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా బహిరంగంగా అవమానించారంటూ బిజెపి నాయకుడు కొండపర్తి సంజీవ్ కుమార్ గతంలో స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (హెచ్ఆర్సి)ను ఆశ్రయించారు. సంజీవ్ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన కమిషన్, ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఏప్రిల్ 27న తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ ముందు స్వయంగా హాజరుకావాలని రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ)కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒక సిఐ తీరుపై ఏకంగా సిపి స్థాయి అధికారి వివరణ ఇవ్వాల్సి రావడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. పోలీస్ అధికారుల అతివాదంపై బాధితులు చేసిన పోరాటం ఈ ఆదేశాలతో



TELANGANA HUMAN RIGHTS COMMISSION

COMMON ORDER

ఒక కొలిక్కి వచ్చినట్లయింది. ఈ పరిణామం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారడమే కాకుండా, బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు చట్టానికి లోబడి పనిచేయాలనే సంకేతాన్ని పంపింది. హక్కుల కమిషన్ ఇచ్చే తుది తీర్పుపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

# అక్షర ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేద్దాం

- ప్రతి ఇంట అక్షరం - ప్రతి మనిషికి విద్య అందించటమే ప్రభుత్వ లక్ష్యం
- కొండపల్లి పురపాలక చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు

**ఇబ్రహీంపట్నం, మార్చి 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** అక్షరాస్యతను పెంపొందించే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం పుస్తకాలు నోట్ బుక్స్, పెన్సిల్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 2022 మంది నిరక్షరాస్యులను గుర్తించమని వారికి చదవడం రాయడం సంతకం నేర్పించి సమాజంలో గౌరవం తీసుకురావాలని అన్నారు. కమీషనర్ వెంకటరత్నం మాట్లాడుతూ పట్టణం లో ప్రతేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా వారికి విద్య నైపుణ్యాలను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో



వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, పట్టణ మహిళా ప్రెసిడెంట్ చుట్టుకుదురు వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు చనుమోలు నారాయణ, వాసు,శ్రీధర్, ఆర్పీలు పాల్గొన్నారు.

# ఆ గ్రామంలో నుండి ప్రయాణం చాలా ప్రమాదకరం

### ప్రయాణికులు చిన్నారులపై శునకాలు దాడి




**చేజర్ల మార్చి 02 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని మాముదూరు గ్రామంలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి అంటూ మాముదూరు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కుంకు బాలయ్య నాయుడు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుక్కలను ఇక్కడ నుండి పంపించాలని అధికారులను కోరారు. దీనికి నిదర్శనం. ఇటీవల జరిగిన కుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులు ఒక చిన్నారి గాయపడిన తీరును పరిశీలించాలని కోరారు. ఇది జరిగిన తరువాత పంచాయతీ పరిపాలన అధికారులు కు తెలిపిన పట్టించుకోలేదని అందుకే గ్రీవెన్స్ లో అర్జీ సమర్పించామని వారు తెలిపారు. అలాగే ఇది చేజర్ల మరియు సంగం ప్రధాన రహదారి కావడంతో నిరంతరం రద్దీగా ఉండే ఈ రహదారి లో ప్రయాణం చేయాలంటే ప్రాణాలను సైతం అర చేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది అని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు తక్షణమే ఈ శునకాలను ఇక్కడ నుండి తరలించాలని వారు కోరారు. ఇంత చిన్న పని కూడా చేయకపోవడంతో ఆయన సంబంధిత అధికారులపై మండి పడ్డారు.

# ప్రభుత్వం వెంటనే... రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

- అకాలపు వాన... అరికల కూడు.
- అచ్చి వచ్చిన భూమి.... ఒక్క అడిగే చాలు
- టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని

**జవహర్ నగర్, మార్చి 2: (వార్తా ప్రభ)** అకాలపు వాన... అరికల కూడు అని, అచ్చి వచ్చిన భూమి.... ఒక్క అడుగైనా చాలని టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని అన్నారు. తెలంగాణ రైతు తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 13వ విడత అన్నదాన కార్యక్రమం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సరం కానుకగా రైతు భరోసా నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, మరోసారి సంక్రాంతి కానుకగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని చెప్పారని, మూడోసారి పురపాలక ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేస్తామని చెప్పిన హామీలన్నీ బుట్ట దాఖలు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం కోసం ఇచ్చే రైతు భరోసాను సమయానికి రాకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చి సాగు చేస్తున్నారని తెలిపారు. దీనివలన రైతులు అప్పులపాలై ప్రాణాల మీదికి తెచ్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను ఏడవ తారీకు లోపు విడుదల చేయాలని లేనియెడల ప్రజా సంఘాలు రైతు సంఘాల తో కలిసి ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్ లో పెద్ద ఎత్తున




ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో దావత్ అరుణ్ కుమార్,, అంబాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ మిలన్ వేడుకలు






**హైదరాబాద్,మార్చి 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉస్మాన్ షాహి ట్రేడర్స్ అసోసియేషన్ (ఓటిఏ) వారు మార్చి 1, 2026న ఇబ్రాహిపట్నంలో ఉన్న సిరి నేచర్ వ్యాలీ రిసోర్ట్స్ లో హోలీ మిలన్ వేడుకను విజయవంతంగా నిర్వహించారు. సభ్యులు ఉత్సాహంగా రేన్ డ్యాన్స్, బోటింగ్, స్విమ్మింగ్, టాంబోలా గేమ్ మరియు వివిధ ఇండోర్ గేమ్స్‌లో పాల్గొన్నారు. రుచికరమైన లంచ్ మరియు హై–టీతో ఈ వేడుక అందరికీ ఆనందదాయకమైన మరియు మరపురాని అనుభవంగా నిలిచిందనీ అధ్యక్షులు బోయిన వెంకటేష్ యాదవ్ "వార్తా ప్రభ" కు తెలిపారు. ఈ



కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రాహుల్ గుప్తా, కోశాధికారి బి రాజేంద్రప్రసాద్, ఐ.ఎమ్.ఎమ్. ఫాస్ట్ ప్రెసిడెంట్ పి రామచంద్ర, ఉపాధ్యక్షులు ఎస్ సుధాకర్ రెడ్డి, సంజయ్ అగర్వాల్, సలహాదారులు పవన్ అగర్వాల్, మనిష్ కబ్రా, జాయింట్ సెక్రెటరీ దిలీప్ కుమార్, కో – ట్రెజర్లు విజయ్ ఆనంద్ యాదవ్, పవన్ తివారి, కార్యవర్గ సభ్యులు పి రాజ్ కుమార్, కే నర్సింగరావు, సతీష్ కుమార్, అమిత్ అగర్వాల్, సిద్ధారెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు వెంకటేష్ తెలిపారు. సభ్యులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### -ఎమ్మెల్యే అరికపూడి గాంధీ




**శేరిలింగంపల్లి,మార్చి 2 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి మండలంలోని పలు డివిజన్లకు చెందిన 250 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన రూ.2,50,29,000 ఆర్థిక సహాయాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని,అర్హులైన వారు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అప్పారెడ్డిపల్లిలో ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు .

### - ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ(మార్చి 2):**మాడ్గుల మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.


## నిమ్రా దంత వైద్య కళాశాలలో నోటి వ్యాధి నిర్ధారణ దినోత్సవం




**ఇబ్రహీంపట్నం, మార్చి 02(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని జూపూడి గ్రామంలో గల నిమ్రా దంత వైద్య కళాశాలలో ప్రఖ్యాత నోటి వ్యాధి నిర్ధారణ నిపుణుడు డాక్టర్ హెచ్. ఎం. ఎం. ధోలాకియా జన్మదినాన్ని నోటి వ్యాధి నిర్ధారణ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పకళ తయారీ,లోగో రూపకల్పన మరియు రీల్స్,వీడియో తయారీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సృజనాత్మకత మరియు శాస్త్రీయ అవగాహనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా సాహిత్య రెడ్డి మాట్లాడుతూ నోటిని ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉంచుకోవటం ప్రధానమని అన్నారు. సరైన సమయంలో పరీక్షలు నిర్వహించడం వలన దంత వ్యాధులను ముందుగా నిర్ధారించి చికిత్స చేయవచ్చని తెలిపారు . ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా రామానంద్,డా లుంబిని, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐ తో భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు

### ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె రామకృష్ణయ్య



**ఇబ్రహీంపట్నం, మార్చి 02(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని కేతనకొండ గ్రామంలో గల ఆర్కె ఇంజనీరింగ్ కళాశాలలో ఎ ఐ డీప్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కారిణి రోషిని హాజరయ్యారు. విద్యార్థులకు ఎఐ, టూల్స్ మోడల్స్ మరియు డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ను ప్రాక్టికల్ గా వివరించారు. వివిధ అంశాలపై విద్యార్థికి లోతైన శిక్షణ కల్పించారు. శనివారం వర్క్ షాప్ ముగింపు సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఏ ఐ ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని, ఇలాంటి వర్క్ షాప్ ల ద్వారా భవిష్యత్తుపై అవగాహన సాధిస్తారని తెలిపారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని వాటిపై, నైపుణ్యత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఐఎంఎల్ మరియు డీఎస్ విభాగాధిపతి షేక్ షాబాజ్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా కాణిపాకంలో "కాణిపాకంలో అరుణోదయం" పుస్తక ఆవిష్కరణ



**తిరుపతి,మార్చి 2 (వార్తాప్రభ) :** శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దివ్య సన్నిధిలో "కాణిపాకంలో అరుణోదయం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఈ రోజు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ముందుగా ముఖ్య అతిథులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ మంత్రి, మాజీ శాసనసభ్యురాలు గల్లా అరుణకుమారి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ , గౌరవ అతిథిగా ఆలయ కార్యనిర్వాహక అధికారి పెంచల కిషోర్ పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ రచయిత పత్రపాటి రమేష్ నాయుడు "కాణిపాకంలో అరుణోదయం" పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం రచయితను సన్మానించారు. గల్లా అరుణకుమారి మాట్లాడుతూ, స్వామివారి ఆశీస్సులతో ప్రజాసేవ చేసే అవకాశం లభించిందని, కాణిపాకం ఆలయ అభివృద్ధి తనకు ఎప్పటికీ ప్రత్యేకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణి నాయుడు, డీపీఓ సుధాకర్ బాబు , ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం , మాజీ ఈవో కేశవులు , అలాగే అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పరిశ్రమలు రావాలని

● క్రిస్టియన్ కౌన్సిల్ ఏపీ అధ్యక్షులు మోసా అబ్రహాం బృందం ప్రార్థనలు

**కాకినాడ,మార్చి 2 (వార్తాప్రభ) :** రాష్ట్రానికి పరిశ్రమలు ఏర్పాటు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అబ్రహం ఆధ్వర్యంలో 10వ డివిజన్ దుమ్ములపేటలో గల విక్టరీ రివైవల్ సెంటర్ నందు ప్రే ఫర్ ఆంధ్ర ప్రదేశ్ అనే ప్రార్థన కార్యక్రమం సోమ వారం సుమారు 75 మంది పాస్టర్లతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్, క్రైస్తవ నాయకులు కొడాలి విజయ్ ల కొరకు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర క్షేమం కోసం ప్రార్థించడమే తమ (క్రైస్తవుల) బాధ్యతని బిషప్ పిఎస్ .లాజరస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రూపస్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవ ప్రార్థన మందిరాలలో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి,నాయకులు క్షేమం కొరకు ప్రార్థన చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు మోసా అబ్రహాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి తలపెట్టిన పోలవరం, అమరావతి నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రతినెల 2తేదీన ఈ ప్రార్థన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని దాని ద్వారా యువతకి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంతేకాకుండా



ప్రభుత్వ నాయకులు అధికారులతో పాటు తకు కూడా ఈ బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి సి ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోజెష్ కుమార్ ,సెక్రెటరీ డి. చార్లెస్ కోశాధికారి ఎస్. ప్రభాకర్, సిటీ అధ్యక్షులు శ్రీ ఫణి , పి.సాల్మన్ రాజు, నక్కా షాలేం రాజు, టి. రాజుబాబు, ఎబినేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పెయింటింగ్ పనుల కార్మిక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

**అమలాపురం,మార్చి 2 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సోమవారం అమలాపురం పెయింటింగ్ పనుల కార్మిక సంక్షేమ సంఘం' నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడు రంకిరెడ్డి శ్రీను, ఉపాధ్యక్షుడు యనమదల ప్రభు, ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి కాశీ సత్యనారాయణ,కోశాధికారి గొవ్వాల బాలకృష్ణ, ఆడిటర్,గెడ్డం శ్రీనివాస్, తోత్తరమూడి విజయ్ కుమార్, సభ్యులుగా తోత్తరమూడి సాయిబాబు,నూతక్కి చిన్నని, కొల్లా రమణ, గురంపూడి ఉమ, సత్యనారాయణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. యూనియన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు విందు ఏర్పాటు చేశారు. అనంతరం ఒక సేవా



కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ సభ్యుడు మామిడిశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం పెయింటింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోగా,అతని వైద్య ఖర్చుల నిమిత్తం సంఘ అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు.

# జాతీయస్థాయి చిత్రలేఖనం' పోటీలలో కాకతీయ -అపోలో విద్యార్థుల ప్రతిభ



**నందిగామ,మార్చి 2 (వార్తాప్రభ) :** "డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ" విజయవాడ వారు విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలనే ఆలోచనలతో వికసిత్ భారత్, స్వచ్ఛభారత్, సేవ్ వాటర్, సేవ్ యానిమల్స్, వంటి వివిధ రకాల అంశాలపై "జాతీయ స్థాయిలో "చిత్రలేఖనం పోటీలు గత శనివారం నిర్వహించారు. ఈ కాంపిటీషన్స్ లో స్థానిక కాకతీయ అపోలో విద్యార్థులకు మొదటి బహుమతులుగా "బంగారు పతకాలను" 11 మంది విద్యార్థులు , రెండవ బహుమతులుగా "వెండి పతకాలు" ముగ్గురు విద్యార్థులు, అందుకోవటంతో పాటు, బెస్ట్ ఆర్ట్ స్కూల్ అవార్డు రావడం మరో విశేషం. ఇందులో జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల నుండి దాదాపు 300 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తొండపు జనార్ధన్, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఏపీ సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, తెలుగు అకాడమీ చైర్పర్సన్ ఆర్డీ విల్సన్, బొర్రా రాధాకృష్ణ(గాంధీ) దుర్గగుడి పాలకమండలి అధ్యక్షులు, ఆర్ట్ అకాడమీ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ శ్రీ పి. రమేష్, పలువురు ప్రముఖులు పాల్గొని, ఎగ్జిబిషన్ ను ప్రారంభించి తదనంతరం వారి చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం చేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థిని విద్యార్థులను పాఠశాల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, వైస్ చైర్మన్ కాపా భారతి, కాకతీయ సీబీఎస్ఈ డైరెక్టర్స్ కాపా కార్తికేయ,కాపా సుష్మాంజలి, క్లవర్ నెక్స్ట్ స్కూల్ డైరెక్టర్ స్ఫూర్తి, ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు, మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

# వైసీపీ మండల పార్టీ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం



**విస్సన్నపేట,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వికాస్ టెక్నో రోడ్డులో వైసీపీ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు వైసిపి నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పలు నామినేటెడ్ పోస్టులలో ఉన్న నాయకులు వైసిపి కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు. రాబోయే కాలంలో గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్, జడ్పిటిసి ఎన్నికల అత్యధిక మెజార్టీ సాధించేందుకు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా పథక రచన చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. 13వ తేదీన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా జిల్లా నాయకులను ఆహ్వానిస్తున్నామని అదే రోజు అందరి ఆమోదంతో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు మీడియా సమావేశంలో చెప్పారు.

# నైటింగేల్ ఆఫ్ ఇండియా కు ఘన నివాళి



**కృత్తివెన్ను,మార్చి 2 (వార్తాప్రభ) :** భారత స్వాతంత్ర్య సమరయోధురాలు ,ప్రముఖ కవయిత్రి సరోజినీ నాయుడు వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు ప్రధాన ఉపాధ్యాయులు టి వి వి ప్రసాదు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు స్వాతంత్ర్య సాధనలో పాలు పంచుకోవాలని ఆలోచించి కాంగ్రెస్ భావలపట్ల ఆకర్షితు రాలై దేశవ్యాప్తంగా తన అద్భుతమైన కంఠస్వరం తో స్వాతంత్రోద్యమంలో ఉపాన్యాసాలిస్తూ ప్రజలను మంత్రముగ్ధులను చేశారని,1925 డిసెంబర్లో కాన్పూర్ లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన తొలి భారతీయ మహిళ గా చరిత్ర సృష్టించారని,మహాత్మా గాంధీ తో కలసి సహాయ నిరాకరణ ఉద్యమం,ఉప్పు సత్యాగ్రహం,క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియా శీలకంగా పాల్గొన్నారని, స్వాతంత్ర్య పోరాటంలో పలుమార్లు జైలుకు వెళ్లారని అన్నారు. మహిళల హక్కుల కోసం జీవిత పర్యంతం అవిశ్రాంతంగా పోరాడారని,స్వాతంత్రం వచ్చిన తర్వాత ఉత్తర ప్రదేశ్ కు గవర్నర్ గా పనిచేసి భారత దేశంలో తొలి మహిళా గవర్నర్ గా నిలిచారని అన్నారు. ఈమె రాసిన ఆంగ్లకవితలలో "ది గోల్డెన్ త్రెషోల్డ్ ది బర్డ్ ఆఫ్ టైమ్"వంటి రచనలు భారతీయ సంస్కృతి ని ప్రతిబింబిస్తాయి అని సూర్య ప్రకాష్ అన్నారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు యేసు పాదం విజయ్ కుమార్ చంద్ర మోహన్ వీరంకి శ్రీనివాసరావు,యేసుబాబు, మురళీ కృష్ణ, ప్రభ, రేఖ, దుర్గా జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు మండల టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా అధ్యక్షులు గురుమూర్తి

**పెడన,మార్చి 2 (వార్తాప్రభ) :** గూడూరు మండలం గూడూరులో మండల నూతన టిడిపి కార్యాలయాలయం పనులను సోమవారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మరియు కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి పరిశీలించారు నాయకులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో గూడూరు మండలశీ టిడిపి అధ్యక్షులు గోపి నాగబాబు ప్రధాన



కార్యదర్శి తోట వేణు మాజీ ఎంపీపీ కాసగాని శ్రీను నాయకులు అన్నం హరి రామకృష్ణ, ఎన్ ఏ బేగ్, యర ప్రసాద్, బేతల స్వామి కాట్రగడ్డ రత్న బాబు బొల్లా రాజేష్, పోతుల రాము బచ్చుల శ్రీను, గొరిపర్తి చంద్రశేఖర్, జొన్నలగడ్డ రమేష్,తదితరులు పాల్గొన్నారు,

# దేవస్థానం భూమి అన్యాక్రాంతం వ్యవహారంలో పూర్వపు తహసీల్దార్ పై విచారణ కోరుతూ ఫిర్యాదు..



**మోపిదేవి/అవనిగడ్డ,మార్చి 2 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ,మోపిదేవి రెవిన్యూ గ్రామ పరిధిలో ఉన్న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన భూమి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా థర్డ్ పార్టీకి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేశారనే ఆరోపణలతో అప్పటి మోపిదేవి తహసీల్దార్ కలిదిండి మస్తాన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మోపిదేవి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బాల దుర్గా రాం ప్రసాద్ జాయింట్ కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైన ఈ విషయంపై ఫిర్యాదులో పెర్కొన్న వివరాలిలావున్నాయి. మోపిదేవి మండలం కోసూరు పాలెం గ్రామానికి చెందిన కోసూరు రఘునాదరావు 14-02-2022న ఆన్‌లైన్ ద్వారా ఎఫ్-లైన్ కొలతల కోసం (సర్టిఫికెట్ నం: ఖీూ 12101733825) దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆ దరఖాస్తును 14-03-2022న ఎండార్స్‌మెంట్ ద్వారా ఆన్లైన్లో తిరస్కరించినట్లు తహసీల్దార్ కార్యాలయం తెలియజేసింది. అయితే ఇదే సర్టిఫికెట్ నంబర్‌తో, ఇదే సర్వే నంబర్ గల భూమికి సంబంధించి 29-10-2021 తేదీతో మాన్యువల్‌గా సర్టిఫికెట్ జారీ చేసి హక్కు కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే అప్లికేషన్ నంబర్‌ను ఒక సందర్భంలో తిరస్కరించి, మరొక సందర్భంలో కార్యాలయ ఆర్ వో సి నంబర్ లేకుండా నే మాన్యువల్‌గా మంజూరు చేయడం కార్యాలయ రికార్డ్ ల నిర్వహణ అనుమానాస్పదమని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. తహసీల్దార్ మస్తాన్ సంతకం తో జారీ చేయబడిన ఈ ధ్రువీకరణ పత్రం తమ కార్యాలయ రికార్డ్ లలో ఎక్కడా నమోదు కాబడలేదని ఆ సర్టిఫికెట్ లో పేర్కొనబడిన భూమి సర్వే నంబర్ ప్రభుత్వ భూమిగా ఉందని ఇదే మోపిదేవి తహసీల్దార్ కార్యాలయశీ వారు కూడా ధ్రువీకరించడం జరిగిందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. సర్వే నం. 633 లో ఉన్న భూమి విషయంలో ఇప్పటికే ఏపీ హై కోర్టు ప్రభుత్వ భూమిగా పెర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు, అలాగే రెవిన్యూ రికార్డుల్లో ఆ భూమి ప్రభుత్వ భూమిగా, ప్రొహిబిటెడ్ జాబితాలో, చెరువు భూమిగా నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. అలాంటి భూమికి తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేయడం అధికార దుర్వినియోగమేనని ఆరోపించారు. దేవస్థానం చెరువు భూమి అన్యాక్రాంతం కావడానికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత మొవ్వ తహసీల్దార్ కె. మస్తాన్‌పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌ను దుర్గా రాం ప్రసాద్ ఫిర్యాదులో కోరారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయితే సహించేది లేదని దీనిపై తక్షణమే విచారణ కు ఆదేశిస్తున్నట్లుగా జాయింట్ కలెక్టర్ తెలిపినట్లు బాల దుర్గా రామ్ ప్రసాద్ స్థానిక విలేఖర్లకు వివరించారు.

# ఎండపల్లి పంచాయతీ పరిధిలో పల్లె పండుగ అభివృద్ధి పనులు....



**కృత్తివెన్ను,మార్చి 2 (వార్తాప్రభ) :** పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఎండపల్లి పంచాయతీ గాంధీనగర్ లో విస్తృతంగా రహదారుల నిర్మాణం మొదలైంది. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా విడుదల చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు తో. గ్రామ సర్పంచ్ పిన్నింటి ప్రభువు ప్రసాద్ మరియు జనసేన నాయకులు పిన్నింటి రాంబాబు గాంధీనగర్ గ్రామంలోని రోడ్లు కు పూజలు చేసి పనులను ప్రారంభించారు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ 21 లక్షలతో చేపట్టిన పనులు సరవేగంగా జరుగుతున్నాయి యి ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు సుంకర బాబురావు, పిన్నింటి నరసింహ,ఈమన రామాంజనేయులు పాల్గొన్నారు.

# జనతా వారిది కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోపరుచుకోవాలి



**కంకిపాడు/పెనమలూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** జనతా వారిది కార్యక్రమాన్ని పరిధిలో సద్వినియోగపరచుకోవాలని కంకిపాడు మండల బిజెపి అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కంకిపాటి సురేష్ బాబు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో స్థానిక రైతు బజార్ ఎదురుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ , జిల్లా అధ్యక్షులు తాతి నేని శ్రీరామ్ ఆదేశాల మేరకు జనతా వారిది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని. బిజెపి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి కో కన్వీనర్స్ ఇంటూరి నరేష్, ఉపద్రష్ట మురళీకృష్ణ, డొక్కు విష్ణువర్ధన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రంగారావును సన్మానించిన పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు



**కంకిపాడు/పెనమలూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** తాడిగడప మున్సిపాలిటీ పోరంకి గ్రామంలో గోసాల గ్రామానికి చెందిన సంగేపు రంగారావు కు, పెనమలూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులుగా రెండోసారి పదవి బాధ్యతలు చేపట్టడంతో, పి వి ఎస్ ఆర్ పాఠశాలలో ప్రాంగణంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మా బీసీ నాయకులు సంగేపు రంగారావుని రెండోసారి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుగా నియమించినందుకు పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బోడే ప్రసాద్ మరియు యువ నాయకుడు బోడే వెంకటరామ్ కి కృతజ్ఞతలు తెలియజేసి. ఎల్లవేళలా మేము మీకు అండగా ఉంటామని తెలిపారు. రంగారావు పద్మశాలీల కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులు పంచుమర్తి ప్రసాద్, కార్యనిర్వాహన అధ్యక్షులు మసనం శ్రీనివాసరావు, సెక్రెటరీ ఎలగందుల శ్రీనివాసరావు,కోశాధికారి గుర్రం నాగమణి, ఉపాధ్యక్షులు కానూరు వెంకటరమణ, పంచుమర్తి సత్యనారాయణ ,జాయింట్ సెక్రెటరీ కాట్రు రాంబాబు,మసనం శివనాగేశ్వరరావు ,గట్టు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ (IIIT) నూజివీడు విద్యార్థులకు పరుపుల పంపిణీ




**నూజివీడు,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) నూజివీడు క్యాంపస్‌లో విద్యార్థులకు పరుపులు, దిండ్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు వీటిని అందజేశారు. నూతనంగా చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థినులతో పాటు, గతంలో పరుపులు తీసుకోని రెండవ సంవత్సర విద్యార్థులకు, ఎంటెక్ (M.Tech) మొదటి సంవత్సర విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పరుపులతో పాటు దిండ్లను కూడా యాజమాన్యం అందజేసింది. ఈ సందర్భంగా డైరెక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమానికి తాము ప్రాధాన్యతనిస్తామని, క్యాంపస్‌లో మెరుగైన వసతులు కల్పించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ పరిపాలనాధికారి (AO) డాక్టర్ లక్ష్మణరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (ఇూౠ) డాక్టర్ రాజేష్, డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్లు బి. సురేష్ బాబు, డాక్టర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఆవాసాలు మధ్య మద్యం షాపు వద్దు కలెక్టరుకు వినతి



**కాకినాడ,మార్చి 2 (వార్తాప్రభ) :** కాకినాడ సిటి13వ డివిజన్ సాంబమూర్తి నగర్ రెండో వీధిలో నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడంపై స్థానికులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెదేపా 13 వ వార్డు ఇంచార్జి గాది శివరామకృష్ణ, స్థానికులు మాట్లాడుతూ జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని, వెంటనే మరో ప్రాంతానికి తరలించాలని డిమాండు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో 30 అడుగుల దూరంలో ఈఎస్ఐ హాస్పిటల్, వంద అడుగుల దూరంలో మున్సిపల్ స్కూల్, 50 అడుగుల దూరంలో దేవాలయాలు ఉన్న ఈ ప్రాంతాల్లో వైన్‌షాపు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, స్కూల్ పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే ఈ మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తొలగించే వరకు రోజూ ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పాలిక శివ, భాజపా నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పోలకంపాడు ఆర్.ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్ లో ప్రముఖ సంస్థ "భవానీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్" ఫౌండర్ మరియు సి.ఈ.ఓ. కుందేటి రమేష్ యాదవ్ మామ, సంస్థ చైర్మన్ కుందేటి పావని తండ్రి గారు అయిన స్వర్గీయ పుట్టి వెంకట కృష్ణాజీ సంస్మరణ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ వీర్ల శ్రీరామ్ యాదవ్ తో కలిసి నివాళులు అర్పించిన యాదవ ప్రముఖులు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు

–విజయవాడ,మార్చి 2 (వార్తాప్రభ) :

# కాలనీలో మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

## -కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,మార్చి 2 (వార్తాప్రభ) :** మిషన్ భగీరథ పైపు నల్ల కనెక్షన్ ఇంటింటికి మంచినీటిని వృధాగా పోనివ్వకుండా టాపులు అమర్చుకోవాలనీ, కాలనీవాసులకు ప్రాణాధారమైన మంచి నీటిని కాపాడుకొని పొదుపుగా వాడుకొని నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు బేరిరామచంద్ర యాదవ్ కార్యవర్గ కమిటీ సభ్యులు అవగాహన కల్పించారు.వేసవికాలం అప్పుడే వచ్చేసిందనీ, ఎండలు ముదిరిపోయి 33 డిగ్రీల వరకు తెలంగాణ రాష్ట్రంలో ఎండలు కాస్తున్నాయి ప్రజల దాహార్తి తీర్చడానిక హైదరాబాద్ పట్టణం వాటర్ వర్క్స్ సంబంధించిన సూచనల మేరకు నేతాజీ నగర్ కాలనీ వాసులకు ముఖ్యంగా మహిళ సోదరీమణులకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్యాంకులు నిండిన వెంటనే దాన్ని ఆఫ్ చేయడం రోడ్లమీద నీరు పారే విధంగా వదలరాదని దుర్వినియోగం, నీటిని వృధా చేయకూడదని విజ్ఞప్తి చేయడం జరిగింది. ముఖ్యంగా వేసవి కాలంలో ఆఖరుగా నీటి ఎద్దడి వచ్చే ఆస్కారం కూడా ఉంటుంది మనకు సింగూరు మంజీరా కృష్ణ గోదావరి నీళ్ల ఆధారం వలన హైదరాబాద్ పట్టణంలో నీటి సరఫరా చేయడం జరుగుతుంది, కాబట్టి మనం కూడా ప్రభుత్వానికి వాటర్ వర్క్స్ బోర్డ్ కు కూడా సహకరించి నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజానీకానికి పిలుపునివ్వడం జరిగింది. శేరి లింగంపల్లిలో కూడా ప్రజలందరూ నీటిని సద్వినియోగం చేసుకొని వాడుకోవాలని విన్నవించుకోవడం జరిగింది. లోతట్టు ప్రాంతాలలో నీళ్లు పట్టుకున్న తర్వాత వృధాగా వదిలేస్తునారని మా దృష్టికి వచ్చింది టాప్ లు బిగించుకొని మీకు అవసరమైన నీళ్లు పట్టుకున్న తర్వాత ట్యాప్లు బంద్ చేయాలని నీళ్లు వృధా చేయరాదని అందరికీ కోరుకోవడం జరిగింది.

# డిస్ట్రిక్ జడ్జి శ్రీ తిరుమల వెంకటేశ్వర్లు కి ఘన వీడ్కోలు



**విజయవాడ,మార్చి 2 (వార్తాప్రభ) :** విజయవాడ ఫోర్త్ ఎడిషన్ డిస్టిక్ జడ్జి కం ఫ్యామిలీ కోర్ట్ జడ్జి అయినటువంటి శ్రీ తిరుమల వెంకటేశ్వర్లు ఫిబ్రవరి 28 రిటైర్మెంట్ అయిన సందర్భంగా మన బెజవాడ బార్ అసోసియేషన్ లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జడ్జి గారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి శ్రీ ఏ సత్యానంద గారు, 13వ అదనపు జిల్లా జడ్జి శ్రీ భూపాల్ రెడ్డి గారు మాట్లాతూ 1998 నుంచి వెంకటేశ్వర్లు గారు న్యాయమూర్తిగా సేవలను అందిస్తున్నారని, వెంకటేశ్వర్లు గారి యొక్క సీనియారిటీ ని ఈ సందర్భంగా మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ ఏకే భాషా మాట్లాడుతూ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు గారు తిరుపతిలో పుట్టి ఆయన విద్యాభ్యాసం కూడా తిరుపతిలోనే పూర్తయిందన్నారు. 1998లో మున్సిఫ్ జడ్జిగా అపాయింట్ అయ్యారని తదుపరి సీనియర్ సివిల్ జడ్జి గాను మరియు 2017లో అడిషనల్ డిస్టిక్ జడ్జిగా ప్రమోషన్లు పొందారని చివరిగా 2023 నుంచి విజయవాడ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా సేవలను అందిస్తున్నారని తెలిపారు. వెంకటేశ్వర్లు గారు ఫ్యామిలీ కోర్టు లో ఎన్నో కేసులలో కౌన్సిలింగ్ లు ఇచ్చి కుటుంబాలని నిలబెట్టారని కొనియాడారు. పదవీ విరమణ సందర్భంగా సందర్భంగా భాషా గారు మరియు న్యాయవాదులు వెంకటేశ్వర్లు గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సిబిఐ కోర్టు జడ్జి శ్రీ కె సీతారామకృష్ణ రావు గారు కమర్షియల్ కోర్టు జడ్జి శ్రీ జి భూపాల్ రెడ్డి గారు గవర్నింగ్ బాడీ మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని జడ్జి కి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు

# కలెక్టర్ బాబు చొరవతో నా ఇల్లు నాకు వచ్చిందయ్యా...!

● నా అర్జీకి న్యాయం జరిగింది ● కృతజ్ఞతతో కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు



**నెల్లూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** ప్రజల అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగుతుందనే భావన ఉన్న నేపథ్యంలో, ఒక వృద్ధురాలి కృతజ్ఞతాభావం జిల్లా యంత్రాంగంపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచింది. “అర్జీ ఇచ్చామా... పని అయిపోయిందా... వెళ్ళిపోయామా” అన్న భావనకు భిన్నంగా, తన సమస్యను పరిష్కరించిన అధికారులకు ధన్యవాదాలు చెప్పేందుకు ప్రత్యేకంగా కలెక్టరేట్‌కు రావడం విశేషంగా నిలిచింది. హిమాన్షు శుక్ల నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన తొలి గ్రీవెన్స్ డే (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అందిన మొట్టమొదటి అర్జీ ఇదే కావడం విశేషం. వృద్ధురాలు తన సమస్యను వినిపించగానే, కలెక్టర్ మానవీయ దృక్పథంతో స్పందించి, వెంటనే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. “ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం” అనే సందేశాన్ని ఆయన ఈ సందర్భంగా చాటిచెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఆలస్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యను పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపించారు. చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్య ఒక్క అర్జీతో పరిష్కారమవడంతో వృద్ధురాలి ఆనందానికి అవధులు లేకపోయాయి.

**శరీరం సహకరించకపోయినా... కృతజ్ఞత చెప్పాలనే తపన..** వయస్సు పైబడి, ఆరోగ్యం సహకరించకపోయినా... తన సమస్యను పట్టించుకుని తన కుమారుని నుంచి తన ఇంటిని తనకు ఇప్పించిన కలెక్టర్ కు స్వయంగా కృతజ్ఞతలు చెప్పాలని ఆమె నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో అతి కష్టం మీద కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో జిల్లా అభివృద్ధి పై సీఎం గారితో సమావేశం నేపథ్యంలో కలెక్టర్ విజయవాడకు వెళ్లటంతో అందుబాటులో వున్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్ ను ఆమె కలిశారు. వారికి మిఠాయిలు అందజేసి, మనస్ఫూర్తిగా దీవించారు. ఈ సంఘటన అక్కడి సిబ్బందిని కూడా భావోద్వేగానికి గురిచేసింది. ఒక సామాన్య వృద్ధురాలి కృతజ్ఞత, జిల్లా యంత్రాంగం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రజల అర్జీలపై తక్షణ స్పందన, మానవీయ దృక్పథం ఉంటే పరిపాలన ఎలా ఉండాలో ఈ సంఘటన చూపించింది. ప్రజా సమస్యల పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చూపుతున్న చొరవ ఫలితంగా, ఇది జిల్లా యంత్రాంగానికి ఒక ప్రేరణాత్మక ఘట్టంగా నిలిచింది.

**సమస్య నేపథ్యం ఇది...** గత సంవత్సరం సెప్టెంబర్ 22వ తేదీన కావలి కి చెందిన రమా జ్యోతి అనే వృద్ధురాలు నడవలేని స్థితిలో నెల్లూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కింద కూర్చొని ఉండగా అటుగా వెళుతున్న కలెక్టర్ గమనించి నేరుగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్వహించిన మొదటి పి జి ఆర్ ఎస్ లో మొట్టమొదటి అర్జీని ఆమె వద్ద నుండి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్వీకరించారు. ఆమె పెద్ద కొడుకు తనను మభ్యపెట్టి తాను నివసిస్తున్న ఇంటిని తన పేరు మీద రాయించుకుని తనను ఇంటి నుంచి వెళ్ళగొట్టాడని, నిలువ నీడ లేకుండా చేశాడరని వాపోయింది. తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు పిలిచి ఆమెకు వెంటనే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ ను రద్దుచేసి ఆమె ఇంటిని ఆమెకు గౌరవంగా జిల్లా కలెక్టర్ అప్పగించారు.

# కిమ్స్ ప్రాంగణంలో ఘనంగా జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహా సభలు

● ఈ సభల విజయానికి తోడ్పడిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన చైతన్య రాజు



**అమలాపురం,మార్చి 2 (వార్తాప్రభ) :** ఫిబ్రవరి 28 వ తేదీ స్థిరవారం మర్చి 1 వ తేదీ ఆదివారం, రెండు రోజుల పాటు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు ఘనంగా జరిగాయని, రెండు తెలుగు రాష్ట్రాలనుండే కాక దేశ విదేశాల లోని అనేక మంది తెలుగు వారి నుండి విశేష స్పందన లభించిందని, సుమారు 50 వేల మందికి పైగా ప్రత్యక్షంగా హాజరు కాగా లక్షల సంఖ్యలో తెలుగు వారు సాంఘిక మాధ్యమాల ద్వారా ఈ సభలను వీక్షించి స్పందించడం చాలా సంతోషదాయకమని , స్ఫూర్తిదాయకమని ఈ ప్రపంచ తెలుగు మహా సభల నిర్వాహకులు, కిమ్స్, చైతన్య విద్యా సంస్థల స్థాపకులు, చైర్మన్, మాజీ శాసన మండలి సభ్యులు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ కె.వి.వి సత్యనారాయణ రాజు(చైతన్య రాజు) తెలిపారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా,ఒరిస్సా రాష్ట్రాల గవర్నర్లు, అనేక మంది న్యాయ మూర్తులు,కేంద్ర, రాష్ట్ర మంత్రులు,ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు,సినీ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, తెలుగు పండితులు, ప్రవచన కర్తలు, అష్టావధానులు,శత, సహస్రావధానులు, రాష్ట్రం నాలు మూలాల నుండి కవులు,తెలుగు భాషాభిమానులు విచ్చేసి ఈ ప్రపంచ మహా సభలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన వారందరికీ పేరు పేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సభలలో 16 తెలుగు సాహిత్య సదస్సులు, సుమారు 150 మంది కవులచే జరిపిన కవి సమ్మేళనం అద్భుతం, అనూహ్యం,అమృత కలశం అని, అంత మంది కవులు, పండితులకు ఒకే వేదికపై సన్మానం అరుదైన అవకాశమని చైతన్య రాజు తెలిపారు.ప్రతి సంవత్సరం ఇదే విధంగా భాగస్వాములై సహాయ సహకారాలు అందజేసి తెలుగు మహా సభలను విజయవంతం చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి,తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు తోడ్పడాలని శ్రీ చైతన్య రాజు కిమ్స్ ఎం.డి.రవి కిరణ్ వర్మ , గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రొ.ఛాన్సలర్ శశి కిరణ్ వర్మ కోరారు.

# అంగరంగ వైభవంగా బూసమ్మ తల్లి తిరునాళ్లు మహోత్సవం





**ఉయ్యూరు/పెనమలూరు,మార్చి 2 (వార్తాప్రభ) :** ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ కూరాకుల సుబ్బయ్య, బూసమ్మ తల్లి తిరునాళ్లు ఘనంగా జరుగుతున్నాయి. మూడవరోజు అమ్మవారి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. దాత మరియు గ్రామ ప్రముఖులు పల్లపోతు భగవాన్ దాస్ ఆధ్వర్యంలో 31 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం పూజా కార్యక్రమాల నడుమ ప్రతిష్టించారు తిరునాళ్లకు భక్తులు భారీగా హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా భగవాన్దాస్ మాట్లాడుతూ ముదునూరు గ్రామస్తులు అయిన నేను చిన్నప్పటి నుంచి భూసమతల్లి తిరుణాలలో పాల్గొనేవారుమని అమ్మవారి ఆశీస్సులు వలన నేను ఒక ఉన్నత స్థితికి చేరుకోగలిగానని, బూసమ్మ తల్లి గుడి అభివృద్ధి కొరకు, ఆ తల్లి ఆశీస్సులు ఉన్నంతవరకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డోకిపర్రు మహాక్షేత్రంలో కన్నుల పండువగా పుష్పయాగం

● చంద్ర గ్రహణం నేపథ్యంలో నేడు ఆలయం మూసివేత ● అంతకు ముందు కుంకుమార్చన





**గుడ్లవల్లేరు,మార్చి 2 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి వారికి సోమవారం శ్రీ పుష్పయాగం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధా రెడ్డి దంపతుల పర్యవేక్షణలో జరిగిన శ్రీపుష్పయాగంలో కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులతో పాటు భక్తులు ముఖ్యంగా మహిళలు, డోకిపర్రుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి జరిగిన శ్రీపుష్పయాగంలో వెయ్యి కిలోలకు పైగా వివిధ రకాల పుష్పాలు వినియోగించారు. మహాక్షేత్రంలో ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా అలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారు సేద దీరేలా, ప్రతి రోజు పూజలు జరిగే సమయంలో ఎవరి వల్ల నైనా ఏవైనా చిన్న చిన్న దోషాలు జరిగిన పక్షంలో వాటి నివారణకు శ్రీ పుష్పయాగాన్ని ప్రతి ఏడాది ఫాల్గుణ పౌర్ణమి రోజున డోకిపర్రు మహాక్షేత్రంలో నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. శ్రీ పుష్పయాగంలో పాల్గొన్న మహిళలకు సౌభాగ్యం ప్రాప్తించటంతో పాటు లక్ష్మీ కటాక్షం కలుగుతుందని ఆలయ ప్రధాన పూజారి పరాంకుశం శ్రీధర్ స్వామి వివరించారు. పుష్పయాగాన్ని వీక్షించిన, భాగస్వాములైన వారి కుటుంబాలు ధన, ధాన్యాలతో వర్ధిల్లుతాయని తెలిపారు. మల్లెలు, కనకాంబరాలు, చామంతులు, గులాబీల వంటి వివిధ రకాల పుష్పాలను శ్రీ పుష్పయాగంలో భాగంగా అమ్మవారికి సమర్పించారు. సోమవారం ఉదయం 108 కలశాలతో మహాక్షేత్రంలో అభిషేకం నిర్వహించారు. పుష్పయాగం ఆరంభానికి ముందు దేవతామూర్తులతో పాటు యాగంలో వినియోగించే పూలను తిరుమాడ వీధుల్లో, గ్రామంలో ఊరేగించారు. యాగంలో భాగంగా సుదర్శన హటరీమం, పూర్ణాహుతిని వేదపండితులు నిర్వహించారు.

**నేడు సామూహిక కుంకుమార్చన..** లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నాడు డోకిపర్రు మహాక్షేత్రంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. క్షీర సాగర మధనం జరిగినపుడు లక్ష్మీ దేవి ఆవిర్భవించిన రోజున ప్రతి ఏడాది లక్ష్మీ జయంతి నిర్వహిస్తారు. ఆ రోజున సామూహిక కుంకుమార్చన ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిదిన్నర గంటల వరకు నిర్వహిస్తారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కుంకుమార్చనలో పాల్గొని తరించాల్సిందిగా ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ కోరారు.

**నేడు ఆలయం మూసివేత..** చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని మంగళవారం డోకిపర్రు మహాక్షేత్రాన్ని మూసి ఉంచుతారు. సామూహిక కుంకుమార్చన అనంతరం ఉదయం పది గంటల నుంచి రాత్రి ఏడున్నర గంటల వరకు ఆలయం మూసి ఉంటుందని , భక్తులకు దర్శనాలు ఉండవని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఏడున్నర గంటలకు ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

# ఘనంగా ఏపీ స్టేట్ వైసిపి యూత్ అధ్యక్షుడు జన్మదిన వేడుకలు




**విస్సన్నపేట,మార్చి 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన ఉత్సవ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గద్దల మల్లయ్య, మేధావుల సంఘం అధ్యక్షులు ఏ లాలయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి కుటుంబరావు, విస్సన్నపేట సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి గంజిన బోయిన సీతారామయ్య, యూత్ నాయకులు శీలం శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీ దస్తగిరి, బీసీ సెల్ కార్యదర్శి సతీష్, మండల మైనార్టీ అధ్యక్షులు ఆలీ, జిల్లా నాయకులు నటరాజ్, విస్సన్నపేట టౌన్ యూత్ అధ్యక్షులు సునీల్, కొండవరపు ప్రశాంత్, సానం రామకృష్ణ, గంజినబోయిన సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేదీప్యమానంగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...



**గుడ్లవల్లేరు,మార్చి 2 (వార్తాప్రభ) :** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్ధ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.



# కొడాలి నాని ఆశీర్వచనం...



**గుడ్లవల్లేరు,మార్చి 2 (వార్తాప్రభ) :** మండలంలోని వెణుతురుమిల్లి శివారు దేశాయిగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఆ గ్రామ మాజీ సర్పంచి పామర్తి వీర వెంకట రామ్మోహనరావు కుమారుడు కిరణ్‌కుమార్‌కు జరిగిన నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వేముల భాను హనుమాన్ ప్రసాద్, గుడివాడ నియోజకవర్గ నాయకులు పాలేటి చంటి, గొర్ల శ్రీను, చుండూరు శేఖర్, కొంకితల ఆంజనేయప్రసాద్, కాకోల్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, మండల యువజన సంఘాధ్యక్షుడు గుదే రవి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పడమట సుజాత, పార్టీ యువజన జిల్లా కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్ర ప్రసాద్, పార్టీ నాయకులు కుందేటి ఫణి, బాడిగ నాని, శాయన దుర్గాప్రసాద్, నిడుమోలు పెద్దులు, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి

● గడువులోపు సమస్యకు పరిష్కారం చూపాలి
● ఎన్‌టీఆర్ జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 174 అర్జీలు
● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

(మొదటిపేజీ తరువాయి)

చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.జ్యోతి, ఏసీపీ వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోసిబాబుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 174 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 66 అర్జీలు రాగా పురపాలక, పట్టణాభివృద్ధికి సంబంధించి 26, పోలీస్ 18, పంచాయతీ రాజ్ 15, మార్కెటింగ్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగానికి అయిదు అర్జీలు వచ్చాయి. విద్యుత్, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, ఆరోగ్య శాఖలకు నాలుగు చొప్పున అర్జీలు అందాయి. ఇరిగేషన్‌కు 3 అర్జీలు రాగా ఏపీఎస్ఆర్టీసీ, ఎక్సైజ్, విద్య, గృహ నిర్మాణం, మైన్స్, నైపుణ్య అభివృద్ధి, ఎండోమెంట్ కి రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. పశు సంవర్ధక, ఆయుష్, బ్యాంకింగ్ సేవలు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, కార్మిక శాఖకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి పీజీఆర్ఎస్ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న విశ్వసనీయ వేదిక అని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.







అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్లం ఏరియాల్లోమహిళలకు (చుట్టుగుంట కాల్వ గట్టు ప్రాంతం)దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి వచ్చిన విజయవాడ ప్రభుత్వ దంత వైద్యశాల ప్రొఫెసర్ డా.వజ్ర మాధురి, పీజీ విద్యార్థులు లతో కలిసి పాల్గొన్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్
-విజయవాడ,మార్చి 2 (వార్తాప్రభ) :

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188